ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -268 | పేజీలు - 9 వెల - 03/- | సోమవారం 12 జనవరి 2026

# లక్ష్యాల అమలు వేగవంతం

## నేడు మంత్రులు, శాఖల కార్యదర్శులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం



**విజన్ 2047, ఆదాయార్జన మార్గాలపై కీలక సమీక్ష**

**రెవెన్యూ శాఖ సేవలు, ఆస్తుల భద్రతపై అధికారులకు దిశానిర్దేశం**

**వర్చువల్‌గా హాజరుకానున్న జిల్లా కలెక్టర్లు**

**సమావేశం అనంతరం సంక్రాంతికి నారావారిపల్లెకు సీఎం**

అమరావతి, **జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర పాలన, ప్రభుత్వ లక్ష్యాల అమలును వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం నాడు మంత్రులు, శాఖల కార్యదర్శులతో ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు కూడా వర్చువల్ విధానంలో హాజరు కానున్నారు. సమావేశం ప్రారంభంలో, రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ), 2047 విజన్‌లోని 10 సూత్రాలపై అధికారులు ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం ఆదాయార్జన మార్గాలు, మిగతా 2లో...

# నేడు సుప్రీంలో బనకచర్ల కేసు

**పోలవరం-నల్లమల లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో తెలంగాణ పిటిషన్**

**తెలంగాణతో న్యాయపోరాటానికి ఏపీ సిద్ధం**

**నేడు విచారణ నేపథ్యంలో న్యాయ బృందంతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష**

**వృథగా పోయే గోదావరి నీటిని వాడుకోవడమే లక్ష్యమని ఏపీ వాదన**

**ఇది ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధమంటూ తెలంగాణ తీవ్ర అభ్యంతరం**

**అన్ని అనుమతుల తర్వాతే ప్రాజెక్టు చేపడతామని స్పష్టం చేసిన ఏపీ**



ఢిల్లీ **జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం (జనవరి 12న) విచారణ జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయపోరాటానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది.

ఈ కేసులో రాష్ట్రం తరఫున బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధం కావాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు న్యాయ బృందాన్ని, ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ అంశంపై సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు. మిగతా 2లో...

# ఘనంగా 'శౌర్య యాత్ర'

**సోమనాథ్ ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు, అభిషేకం**

**'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ వేడుకల్లో భాగంగా పర్యటన**

**శౌర్య యాత్రలో పాల్గొని డమరుకం వాయించిన ప్రధాని**

**ఆలయ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు**

**రాజ్‌కోట్, గాంధీనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ**

2లో.





## 2026లో తొలి ప్రయోగానికి
# ఇస్రో సిద్ధం...
## కొనసాగుతున్న కౌంట్ డౌన్

**పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌తో 'అన్వేష' ఉపగ్రహం ప్రయోగం**

**శ్రీహరికోట నుంచి సోమవారం ఉదయం 10:17 గంటలకు నింగిలోకి**

**రక్షణ, విపత్తు నిర్వహణలో కీలకపాత్ర పోషించనున్న 'అన్వేష'**

**'అన్వేష'తో పాటు మరో 15 ఉపగ్రహాలను మోసుకెళ్లనున్న రాకెట్**

శ్రీహరికోట **జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) రూపొందించిన 'అన్వేష' భూపరిశీలన ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. మిగతా 2లో...

# విద్యతోనే బీసీల అభివృద్ధికి బాటలు



**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**-వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం**


5లో.

## రాజకీయాలకతీతంగా
# అందరికీ ఇండ్లు

**రామగుండంలో 800 మెగా వాట్ల ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం**

**సింగరేణిని కాపాడేందుకు ప్రణాళికలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**గోదావరిఖనిలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, అడ్లూరి, సురేఖతో కలిసి రూ.175.92 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




గోదావరిఖని**జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కల నిజం చేస్తామని, రాజకీయాలకతీతంగా అందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 96 లక్షల కుటుంబాలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మిగతా 2లో...



# ప్రయాణ కష్టాలు

**ఊరికి వెళ్తున్నామన్న ఆనందం కాస్త ఉసూరుమనేలా ట్రిప్**

**తిరుగు ప్రయాణంలోనూ తప్పని తిప్పలు**

**అధిక చార్జీలు..అంతకు మించిన అవస్థలు**

హైదరాబాద్ అ**జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** : సంక్రాంతి సెలవులు వచ్చేయడంతో నగర వాసులంతా పల్లె బాట పట్టారు. పండుగకు ఇంకా మూడు రోజుల సమయం ఉన్నప్పటికీ రహదారులన్నీ ఇప్పటికే వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. కిలోమీటర్ల మేర బారులు తీరుతూ చీమల మాదిరిగా కదులుతున్నాయి. సంక్రాంతి, దసరా పండుగల సమయంలో ఇలాంటి దృశ్యాలు మనకు సర్వసాధారణమే. అందులో ఆశ్చర్యమేమీ లేదు. మిగతా 2లో...

# అసలు ఫైట్ మాతోనే

**తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తి కాదన్న కేటీఆర్**

**అసలు రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యేనని ఉద్ఘాటన**

**కాంగ్రెస్ 24 నెలల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**

**పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కేవలం గాలివాటమేనని వ్యాఖ్య**

**మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా**



హైదరాబాద్ అ**జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో మిగతా 2లో...

# టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

## మార్షల్ ఆర్ట్స్‌లో డిప్యూటీ సీఎం పవన్ అరుదైన ఘనత

**ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం**

**'ఫిఫ్త్ డాన్' పురస్కారంతో గౌరవించిన 'సోగో బుడో కన్‌రి కై' సంస్థ**

**'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్‌క్లాన్'లో ప్రవేశం**

**ఈ ఘనత సాధించిన తొలి తెలుగు వ్యక్తిగా గుర్తింపు**

**అరుదైన ఘనత సాధించిన ఉపముఖ్యమంత్రి**



అమరావతి, **జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** కరాటే, మార్షల్ ఆర్ట్స్ పట్ల అమితాసక్తిని చూపించే సినీ నటుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అరుదైన ఘనత సాధించారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొంది మిగతా 2లో...

# రాజకీయాలకతీతంగా అందరికీ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

రామగుండం నియోజకవర్గంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుదిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు హర్క వేణుగోపాల్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి రూ.175.92 కోట్లతో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రామగుండం నగరంలో వివిధ డివిజన్‌లలో రూ.80 కోట్ల 52 లక్షలు, టీయూఎఫ్ఐడీ ద్వారా రూ.88 కోట్ల 90 లక్షలతో చేపట్టనున్న నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణ సరఫరా, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టనున్న రూ.6.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

అనంతరం నగరంలో నిర్మించిన 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు, 494 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పేదల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరమే రూ.22 వేలా 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నదన్నారు. 29 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్తు , 52 లక్షల పైగా నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం పాలకుర్తి ఎత్తిపోతల పథకం పనులు త్వరలో చేపడతామని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కృషి మేరకు రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రామగుండం ప్రాంతంలో 10 సంవత్సరాలపాటు ఎటువంటి ప్రాజెక్టులు గత పాలకుల హయాంలో తేలేదని విమర్శించారు. సింగరేణి కార్మికులకు, జెన్ కో, డిస్కంలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించిందని, అదే రీతిలో రాష్ట్రంలో పనిచేసే ఐదు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కోటి రూపాయల బీమా ప్రభుత్వం ప్రారంభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు, జే.అరుణశ్రీ, డి.వేణు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడు సుప్రీంలో బనకచర్ల కేసు

(మొదటి పేజీ తరువాయి)


ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను, కీలకమైన సమాచారాన్ని వెంటనే న్యాయవాదుల బృందానికి అందించాలని అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయి ప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, న్యాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


ఏటా గోదావరి నది నుంచి సుమారు 3000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథగా పోతోందని, అందులో నుంచి కేవలం 200 టీఎంసీల నీటిని మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. దిగువ రాష్ట్రంగా మిగులు జలాలను వాడుకునే హక్కు గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (+ఔఇ) అవార్డు ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు.

"మేం స్నేహ హస్తం అందిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసేలా కోర్టుకు వెళ్లడం విచారకరం" అని మంత్రి నిమ్మల వ్యాఖ్యానించారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి వాడుకోవడంలో తప్పేంటని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇతర రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని, కేవలం మిగులు వరద జలాలను మాత్రమే వినియోగించుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, వారి సూచనల మేరకు మార్పులు చేస్తున్నామని తెలిపారు.

ప్రస్తుతం డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) కోసం పిలిచిన టెండర్లు కేవలం ప్రాథమిక సన్నాహక చర్యలు మాత్రమేనని, అన్ని చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గతవారం తేల్చిచెప్పారు. ఏపీ ప్రతిపాదనలు గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్-1980 అవార్డుకు, అంతర్రాష్ట్ర జల నిబంధనలకు స్పష్టమైన ఉల్లంఘన అని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల వాదనల మధ్య సుప్రీంకోర్టు విచారణ కీలకంగా మారింది.

# టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్.



(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. జపాన్ సంప్రదాయ యుద్ధ కళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థల్లో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' సంస్థ ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదో డాన్) పురస్కారాన్ని అందించింది. గోల్డెన్ డ్రాగన్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదును కూడా అందించింది. అలాగే జపాన్ వెలుపల 'సోకే మురుమత్సు సైన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగానూ పవన్ నిలిచారు. మార్షల్ ఆర్ట్స్ పట్ల 3దశాబ్దాలకు పైగా సాగించిన సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాలు దక్కాయని జనసేన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ మార్గదర్శకంలో పవన్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నతస్థాయి నైపుణ్యం ప్రదర్శించారు. సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రాలను అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా ప్రత్యేకస్థానం సంపాదించారు.

**పవన్‌కు లోకేశ్ అభినందనలు**

: పురాతన జపనీస్ కత్తిసాము కళ కెంజుట్సులో అధికారికంగా ప్రవేశం పొందిన పవన్‌కు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. 'పవనన్న జిజ్ఞాస అద్భుతం. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం, ఇంకా కొత్త అంశాలు నేర్చుకోవాలనే పవనన్న తపన నేటి తరానికి స్ఫూర్తిదాయకం' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి పవన్**

పవన్ కల్యాణ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా, స్టంట్ కో-ఆర్డినేటర్‌గా, కొరియోగ్రాఫర్‌గా, గాయకుడిగా ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభ చాటుకున్నారు. సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే ఆయన మార్షల్ ఆర్ట్స్ ప్రయాణం మొదలైంది. కరాటే, సంబంధిత యుద్ధ కళల పట్ల ఆసక్తి కలిగిన పవన్.. చెన్నైలో ఉన్నప్పుడే కఠినమైన శిక్షణతోపాటు నిరంతర సాధన చేసి బలమైన పునాది వేసుకున్నారు. ఆ తర్వాత శారీరక సాధనకే పరిమితం కాకుండా జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి వాటిని అత్యంత నిబద్ధతతో అనుసరించారు. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి మొదలు.. తమ్ముడు, ఖుషి, అన్నవరం, ఓజీ వంటి చిత్రాల్లోనూ మార్షల్ ఆర్ట్స్‌ను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు.

# పాపం వృద్ధ దంపతులు... డిజిటల్ అరెస్ట్ కు భయపడి

# రూ.14.85 కోట్లు పోగొట్టుకున్నారు!

**ఢిల్లీలో ఎన్ఆర్ఐ డాక్టర్ దంపతులకు భారీ మోసం**

**'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.14.85 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

**17 రోజుల పాటు వీడియో కాల్స్‌లో నిఘా పెట్టి మోసం**

**మనీ లాండరింగ్ కేసుల పేరుతో బెదిరించి డబ్బులు బదిలీ చేయించుకున్న వైనం**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఢిల్లీ సైబర్ క్రైమ్ పోలీసులు**



**ఢిల్లీ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):**

దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. పోలీసు, టెలికాం అధికారులుగా నమ్మించి, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఓ ఎన్ఆర్ఐ వృద్ధ డాక్టర్ దంపతుల నుంచి సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.14.85 కోట్లు కాజేశారు. దాదాపు 17 రోజుల పాటు వారిని భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా, వారి ఇంట్లోనే వారిని బందీలుగా చేసి ఈ దారుణానికి పాల్పడ్డారు.వివరాల్లోకి వెళితే, ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్ ప్రాంతంలో డాక్టర్ ఓం తనేజా, డాక్టర్ ఇందిరా తనేజా దంపతులు నివసిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి (ఖచీ)లో సుమారు 48 ఏళ్ల పాటు పనిచేసి, 2015లో పదవీ విరమణ చేసి భారత్‌లో స్థిరపడ్డారు. గత డిసెంబర్ 24న వీరికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము టెలికాం, పోలీసు అధికారులమని పరిచయం చేసుకున్న నేరగాళ్లు, వారిపై మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయని, అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయని బెదిరించారు.

దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆ వృద్ధ దంపతులను, సైబర్ కేటుగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' అంటూ భయపెట్టారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు, అంటే దాదాపు 17 రోజుల పాటు వీడియో కాల్ ద్వారా వారిని నిరంతరం నిఘాలో ఉంచారు. ఆర్‌బీఐ, సుప్రీం కోర్టు అధికారులుగా నటిస్తూ నకిలీ పత్రాలు చూపించి మరింత భయపెట్టారు. డబ్బు బదిలీ చేస్తే కేసులు పరిష్కరిస్తామని నమ్మబలికారు.

ఈ క్రమంలో డాక్టర్ ఇందిరా తనేజాను బ్యాంకులకు పంపి, విడతల వారీగా ఎనిమిది వేర్వేరు ఖాతాలకు డబ్బు బదిలీ చేయించారు. ఇలా మొత్తం రూ.14.85 కోట్లు బదిలీ చేయించుకున్నారు. చివరకు జనవరి 10న, "మీ డబ్బులు ఆర్‌బీఐ ఆదేశాలతో తిరిగి వస్తాయి, సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లండి" అని చెప్పి కాల్ కట్ చేశారు. తీరా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాక తాము మోసపోయామని దంపతులు గ్రహించారు.

బాధితుల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఈ-ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసు తీవ్రత దృష్ట్యా స్పెషల్ సైబర్ యూనిట్ (×ఖీూా)కు బదిలీ చేశారు. ఇలాంటి 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# 2026లో తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధం...

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జనవరి 12వ తేదీ ఉదయం 10:17 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు సంబంధించిన 22.5 గంటల కౌంట్‌డౌన్ ఆదివారం మధ్యాహ్నం 12:17 గంటలకు మొదలైంది.

'అన్వేష' ఉపగ్రహం దేశ రక్షణ, వాతావరణ అధ్యయన రంగాల్లో అత్యంత కీలకం కానుంది. హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీతో పనిచేసే ఈ ఉపగ్రహం భూమి ఉపరితలాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలించగలదు. దీని ద్వారా సరిహద్దుల వద్ద పర్యవేక్షణ, వ్యూహాత్మక నిఘా కార్యకలాపాలకు కీలక సమాచారం అందుతుంది. అంతేకాకుండా, వాతావరణ మార్పులను అధ్యయనం చేయడం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీ చేయడంలో ఇది సహాయపడనుంది.ఈ మిషన్‌లో 'అన్వేష' ప్రధాన ఉపగ్రహం కాగా, దీనితో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కూడా ఒకేసారి నింగిలోకి పంపుతున్నారు. వీటిలో 7 దేశీయ, 8 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'టేక్‌మీ2స్పేస్' రూపొందించిన ఉపగ్రహం కూడా వీటిలో ఉండటం విశేషం.పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ మిషన్. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుండగా, ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రయోగంపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# లక్ష్యాల అమలు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రాయోజిత పథకాల పురోగతి, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులు, పెట్టుబడుల ఆకర్షణ, ఫైళ్ల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి కీలక అంశాలపై సీఎం సమీక్ష జరుపుతారు.ముఖ్యంగా రెవెన్యూ శాఖ పనితీరుపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించనున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, భూముల సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై మంత్రులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రజల ఆస్తులకు పటిష్ఠ భద్రత కల్పించే విధానంపైనా చర్చిస్తారు. వీటితో పాటు కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' పథకంపై కూడా సమీక్షించనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం, సాయంత్రం సీఎం చంద్రబాబు సంక్రాంతి పండుగ కోసం తన స్వగ్రామం నారావారిపల్లెకు బయలుదేరి వెళతారు.

# అసలు ఫైట్ మాతోనే

(మొదటి పేజీ తరువాయి)

పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు.గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నేత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కూడా పాల్గొన్నారు.

# ఘనంగా 'శౌర్య యాత్ర'

## సోమనాథ్ ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు, అభిషేకం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' వేడుకల్లో భాగంగా ఆయన ఆలయానికి విచ్చేసి, సోమనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రధాని స్వయంగా అభిషేకం, హారతి ఇచ్చి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, పరిపాలన అధికారులతో ముచ్చటించారు.అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన 'శౌర్య యాత్ర'లో ప్రధాని పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో వీరుల గౌరవార్థం ఈ యాత్రను నిర్వహిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. యాత్ర సాగుతున్న దారి పొడవునా ప్రజలు బారులు తీరి 'మోదీ-మోదీ' నినాదాలతో, పూలు చల్లుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. శివుడికి ప్రతీకగా భావించే డమరుకం శబ్దాలు మిన్నంటగా, ప్రధాని మోదీ కూడా ఉత్సాహంగా డమరుకాన్ని చేతుల్లోకి తీసుకుని వాయించారు.

# ప్రయాణ కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా భాగ్యనగరమైతే దాదాపుగా ఖాళీ అయిపోతుంది. రోడ్లన్నీ నిర్మానుష్యమవుతాయి. ప్రయాణమంటేనే రోజువారీ బిజీ జీవితం నుంచి కాసింత ఊరట పొందడానికి, బంధుమిత్రులతో ఉల్లాసంగా గడపడానికి జరిపేది. ఓ వారం రోజుల పాటు యాంత్రిక జీవనాన్ని మరచిపోయి హాయిగా, ఆనందంగా సొంతూళ్లలో గడిపి నూతనోత్సాహంతో తిరిగి నగరానికి చేరుకుంటారు. అయితే ఇప్పుడు ఈ ప్రయాణాలు నరకాన్ని తలపిస్తున్నాయి. సొంత వాహనాలు ఉన్న వారి పరిస్థితి అటుంచితే బస్సులు, రైళ్లు, ఇతర వాహనాలలో వెళ్లే వారి పరిస్థితి దారుణంగా ఉంటోంది.

రెండు మూడు నెలల ముందు టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకుంటే కానీ సీటు దొరకదు. అది లేకుంటే అంతే సంగతులు. స్పెషల్ బస్సుల పేరిట దోపిడీ మొదలవుతుంది. ప్రయివేటు ట్రావెల్స్ వారైతే ఛార్జీకి మూడు నాలుగు రెట్లు అదనంగా వసూలు చేసి జేబులు ఇక్కడే ఖాళీ చేస్తారు. రైలులో అయితే కనీసం నిలబడడానికి కూడా చోటుండదు. ఊరికి వెళుతున్నామన్న ఆనందం ఆవిరైపోతుంది. తిరుగు ప్రయాణంలోనూ ఇదే పరిస్థితి. కిక్కిరిసిన రైళ్లు,బస్సులౌనత్తనడక నడుస్తున్న వాహనాలౌఅధిక ఛార్జీలౌ ఇవన్నీ ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. జాతీయ రహదారులపై పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. తరచూ ట్రాఫిక్ జామ్‌లు తప్పడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొన్ని చోట్ల మరమ్మతు పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం సిబ్బందికి తలకు మించిన భారమవుతోంది. సొంత వాహనాలలో ప్రయాణిస్తున్న వారు నరకాన్నే అనుభవిస్తారు. బయటికి దిగలేక, లోపల కూర్చోలేక నానా అవస్థలు పడుతుంటారు. శారీరక అలసట అనివార్యమవుతుంది. చికాకులు తప్పవు.ప్రయాణాన్ని పూర్తి చేసుకొని గమ్యస్థానం చేరిన వారికి నిరుత్సాహం, అలసట తప్పవన్నది సైకాలజిస్టుల అభిప్రాయం. బంధుమిత్రులు, స్నేహితులతో కాలం గడుపుదామని గంపెడాశతో వస్తే దారిలో ఎదురైన చేదు అనుభవం వారి ఉత్సాహంపై నీళ్లు చల్లుతుంది. రిలాక్స్ అవడం మాట అటుంచి అశాంతికి లోనవుతారు. సెలవులన్నీ ఇట్టే గడిచిపోయి తిరిగి కాంక్రీట్ జంగిల్‌కి చేరుకున్న వారిలో ఏ మాత్రం సంతోషం కన్పించదు.



# కర్నూలులోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం: మంత్రి టీజీ భరత్

**తిరుమల పవిత్రతను దెబ్బతీయడానికి వైసీపీ కుట్ర కర్నూలు అడ్వకేట్ల సంక్రాంతి వేడుకల్లో మంత్రి వ్యాఖ్యలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 11)** కర్నూలు నగరంలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగరంలోని నరసింహారెడ్డి నగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో కర్నూలు అడ్వకేట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలులో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఏ, బీ, సీ క్యాంపుల్లో బెంచ్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. హైకోర్టు బెంచ్‌తో పాటు కలెక్టరేట్ భవనాన్ని కూడా నిర్మిస్తామని తెలిపారు.
అనంతరం తిరుమల పుణ్యక్షేత్రానికి సంబంధించిన అంశాలపై స్పందించిన మంత్రి, మద్యం బాటిళ్ల పేరుతో తిరుమల పవిత్రతను దెబ్బతీయడానికి వైసీపీ కుట్ర చేసిందని ఆరోపించారు. పవిత్రమైన తిరుమలలో ఇటువంటి చర్యలు సరికాదని ఆయన అన్నారు. టెక్నాలజీ సహాయంతో ప్రభుత్వం నిజాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులను అరెస్టు చేయించిందని తెలిపారు.
ప్రజలకు దగ్గరవ్వాలన్న ఆలోచన వైసీపీ నేతలకు లేదని విమర్శించిన మంత్రి, ఇకనైనా ఇలాంటి ధోరణి మానుకోవాలని హితవు పలికారు. తిరుమలలో ఎలాంటి తప్పులు జరిగినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ యలమంచి బాలాజీ, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ లీగల్ సెల్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.ఈ. జగదీష్, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ రాఘవేంద్ర, బీజేపీ నాయకులు లోకేశ్వరయ్య, పీపీలు శ్రీనివాస్ భట్, శ్రీహరి, శ్రీనివాసులు, రంగరవి, లక్ష్మి, రాజేశ్వర రెడ్డి, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లాలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



**నంద్యాల**
నంద్యాల జిల్లాలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షుడిగా డి తిరుపాల్ నాయక్ ప్రధాన కార్యదర్శిగా విక్రమ్ సింహ నాయక్ ట్రెజరీగా టీచర.కేశాలు నాయక్ ఏకగ్రీవంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్. రాష్ట్ర కార్యదర్శి నారాయణ నాయక్. ఆర్గనైజేషన్ సెక్రెటరీ తావు నాయక్. ఆధ్వర్యంలో నియమితులయ్యారు. అనంతరం. రాష్ట్ర కమిటీ నాయకులు మాట్లాడుతూ యువత కు వ్యసనాలకు పోకుండా కాపాడాల్సిన బాధ్యత జిల్లా కమిటీపై ఎంతైనా ఉందని తాండ వాసులను చైతన్యవంతులు చేయాలని. ఎలాంటి సమస్యలు వచ్చినా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పెద్దలు పాల్గొన్నారు



## ఉత్కంఠ భరితంగా ఆర్ జి ఎం కాలేజీ నందు క్రీడలు



**పాణ్యం ప్రతినిధి జనవరి 11,(ప్రజా రిపబ్లిక్ న్యూస్).** మండలంలోని శాంతిరం ఆర్ జి ఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జేఎన్టీయూఏ అంతర్ కళాశాలల క్రీడలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన క్రీడల్లో క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్కంఠ భరితంగా క్రీడల్లో పాల్గొన్నారు. రగ్బీ, కబడ్డీ, బాస్కెట్ బాల్ తదితర క్రీడల్లో బాలబాలికలు పోటాపోటీగా పాల్గొన్నారు. జేఎన్టీయూఏ స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణరెడ్డి క్రీడలను, క్రీడాకారుల సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూఏ పరిధిలో 2024-25 సంవత్సరంలో మొట్టమొదటిసారిగా క్రీడాకారులు జాతీయస్థాయిలో ఒక బంగారు, వెండి, రెండు కాంస్యపతకాలను సాధించారన్నారు. వీరికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.15వేలు, రూ.10వేలు, రూ. 5వేలునగదు బహుమతులను అందజేశామన్నారు. ఈ ఏడాది జేఎన్టీయూఏ పరిధిలోని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి అవసరమైన నిధులు రూ. 26 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండి శివరాం,ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, జేఎన్టీయూఏ విశ్రాంత స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జోజి రెడ్డి, పిడి వెంకటేష్ చంద్రారెడ్డి, పి ఈ టి లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కొత్తూరు సుబ్బరాయునిలో ఆదివారం విశేష పూజలు.

### ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.



**పాణ్యం. ప్రతినిధి జనవరి 11 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
స్థానికపాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నకాల మహా నివేదన సమయంలో స్వామివారికి సర్ప సూక్తంతో సుగంధ ద్రవ్యాలతో, పంచామృత అభిషేకం, మహా రుద్రాభిషేకం, మహా నైవేద్యం, మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులందరికి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం మరియు మంగళవారాల లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు.

## అనుమానాస్పదగా ఎవరైనా వ్యక్తులు కనపడితే 112కు ఫిర్యాదు చేయాలి

### -- సీఐ మంజునాథరెడ్డి

**అవుకు జనవరి 11 రిపబ్లిక్ (న్యూస్)**అవుకు వీధుల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 లేదా 112కు, లేక సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అవుకు సీఐ మంజునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు స్వగ్రామాలకు వెళ్లే హడావిడిలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. అటువంటి ఘటనలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఇంట్లో ఉన్న బంగారు నగలు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, ఊరికి వెళ్తున్న సమయంలో పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించమని కోరాలని తెలిపారు. విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు.ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవి ఇంటర్నెట్‌కు అనుసంధానమైతే మొబైల్ ఫోన్ ద్వారా ఇంటి పరిసరాలను ప్రత్యక్షంగా గమనించవచ్చని వివరించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రజలు తమ ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటుకు సహకరించాలని, స్థానిక పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నంబర్లు, ఇతర పోలీస్ అధికారుల సంప్రదింపు వివరాలను తమ మొబైల్ ఫోన్లలో భద్రపరచుకోవాలని సీఐ మంజునాథరెడ్డి సూచించారు.

# ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి అపారమైనది

**ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు అభినందన**









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 11)**
ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, కృషి ఎంతగానో ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొంది డీఎస్సీ ద్వారా వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎంపీ నాగరాజు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఎవరికి దక్కని గౌరవ మర్యాదలు ఒక్క ఉపాధ్యాయులకే దక్కుతాయన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని నీతి, నిజాయితీలతో నిర్వర్తిస్తూ విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటగా మలచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ ఆది నారాయణ రెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఖ్యాతి స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు కళ్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం







### వై.మధు సూధన్ రెడ్డి, డిసిసి జిల్లా అధ్యక్షుడు

**అనంతపురం క్లాక్ టవర్, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):**
ఎఐసిసి, ఏపీసీసీ ఆదేశాల మేరకు ఆదివారం అనంతపురం జిల్లా, నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథవిధిగా కొనసాగిస్తూ ఇటీవల బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గ్రామీణ్ వీబీ జీ రామ్ జీ బిల్లు ను రద్దు చేయాలని పేర్కొన్నారు. నగరంలోని స్థానిక క్లాక్ టవర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు నిరహార దీక్ష నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.మధు సూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షడు యం.యం.డి.ఇమామ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విగ్రహమును పార్టీ శ్రేణులతో కలసి పులహారం వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్లకార్డులతో, నల్ల రిబ్బన్ ధరించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

**బిల్లును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం**
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై.మధు సూధన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో పాటు నిబంధనలూ మార్చిందనీ దీంతో దేశంలో 13 కోట్ల మంది పని కోల్పోతారని వాపోయారు. ఈ చర్యలను నిరసిస్తూ ఎఐసిసి, ఏపీసీసీ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా జనవరి, ఫిబ్రవరి నెలలో ఉపాధి హామీ పథకం పై, బిజెపి గ్రామీణ వీబీ జీ రామ్ జీ బిల్లు పై ప్రజలతో మమైకమౌతూ పెద్ద అవగాహన కార్యక్రమాలు చేపడుతూ మహాత్మాగాంధీ నరేగా బచావో సంగ్రామం ద్వారా బిల్లును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకు కాంగ్రెస్ పార్టీ ద్వారా ఉద్యమిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 700 జిల్లాల్లో 7 లక్షల మంది కాంగ్రెస్ శ్రేణులు నిరాహార దీక్ష చేయనున్నారని తెలిపారు. ఈ పోరాటం మార్చిలో నిర్వహించనున్న భారీ ర్యాలీలకు పునాది అవుతుందని తెలిపారు. దీనివలన రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారాన్ని వేయడం వల్ల పథకం సక్రమంగా అమలయ్యే అవకాశం లేదని చెప్పారు.

**కుటుంబాలు ఉపాధి పోయి రోడ్డు పైకి వచ్చే పరిస్థితి**
కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు యం.యం.డి.ఇమామ్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో కొత్త చట్టం కారణంగా దాదాపు 75 లక్షల మంది ఉపాధి కోల్పోతారన్నారు. దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి వీబీ జీ రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చి ప్రజలకు కల్లిబొల్లి మాటలతో మోసం చేస్తున్నారు. కేంద్రం నిధులు విడుదల విషయంలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకం కొనసాగక పోతే ఉపాధి కూలీలు, పనిహక్కును కోల్పోతారు, ఉద్యోగులు వారి కుటుంబాలు ఉపాధి పోయి రోడ్డు పైకి వచ్చే పరిస్థితి ఏర్పడుతుందనే విషయాన్ని ప్రజల్లో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

**హాజరైన జిల్లా, మండలాల నాయకులు**
ఈ కార్యక్రమంలో గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈరన్న, రాయదుర్గం ఇంచార్జ్ గౌని ప్రతాప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వడ్డే శీనా, మల్లయ్య, ఐ.వై.సి జిల్లా ఇంచార్జ్ కిషోర్ రెడ్డి, గుంతకల్లు ఆలం నవాజ్, హాఫిజ్ అబ్దుల్ మాలిక్, నబీరసూల్ , మహేంద్ర, గోపాల్ , తాడిపత్రి నజీర్, మన్సూర్, కంబదూరు మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి జీ.పి లింగా రెడ్డి, ఎస్సీ సెల్ నాగేంద్ర, హనుమంతప్ప, కుందుర్పి మండల అధ్యక్షుడు జీ. బొజ్జప్ప, బి బ్లాక్ అధ్యక్షులు గౌని తిప్పేస్వామి, కూడేరు మండల అధ్యక్షులు యోగానందా రెడ్డి, బెలుగుప్ప రమేష్, శెట్టూరు సన్నప్ప, నగర కాంగ్రె నాయకులు హాజీ బషీర్ అహ్మద్, సుధాకర్, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యం

## 250కి పైగా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు -- 15 జెసిబిలతో 2వ విడత స్పెషల్ డ్రైవ్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 11)**
నగర పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం చేశారు. నగరంలో పెరుగుతున్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్న నేపథ్యంలో 2వ విడత ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్‌ను ఆదివారం నిర్వహించినట్లు తెలిపారు.

నగరంలోని 7, 12, 14 శానిటేషన్ డివిజన్ల పరిధిలోని 127 ఖాళీ స్థలాలతో పాటు నగర వ్యాప్తంగా మొత్తం 250కి పైగా ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు 15 జెసిబిలతో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బళ్ళారి చౌరస్తా వద్ద కమిషనర్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డ్రైవ్ అనంతరం షరీన్‌నగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో కొనసాగుతున్న పరిశుభ్రత పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. వెంకటరమణ కాలనీలోని ఓ ఖాళీ స్థలంలో విస్తారంగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయినట్లు గుర్తించారు. ఆ స్థల యజమాని వియల్‌టి చెల్లించకపోవడంతో పాటు మూడు సార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో, ఆ స్థలాన్ని పూర్తిగా శుభ్రపరచి నగరపాలక సంస్థ అవసరాలకు వినియోగించుకోవాలని శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా, ఆ ఖాళీ స్థలంలో పక్కనే ఉన్న ఓ ఆసుపత్రి యాజమాన్యం సి ఒ డి వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలు అక్రమంగా వేయడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. సంబంధిత ఆసుపత్రి యాజమాన్యంపై ట్రేడ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, పిచ్చి మొక్కల వల్ల దోమలు, పాములు, విషకీటకాలు విపరీతంగా పెరిగి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. అందుకే ఖాళీ స్థలాల శుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి రెండో విడత స్పెషల్ డ్రైవ్‌ను క్రమబద్ధంగా చేపట్టామని తెలిపారు.

ఖాళీ స్థలాల యజమానులు తప్పనిసరిగా తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు, జరిమానాలు, అవసరమైతే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం నగరపాలక సంస్థ బాధ్యతతో పాటు ప్రజల సామూహిక బాధ్యత అని పేర్కొంటూ, ప్రజల సహకారంతోనే కర్నూలును ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దవచ్చని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా. నాగ ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, టీపీఈ రాంమోహన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

# విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



**అనంతపురం ప్రతినిధి, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్ ):**ఏపీఎస్ఆర్టీసీ 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు స్థానిక ఎస్.ఆర్. ప్రైమ్ స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. జరిగినట్టు కమిటీ నిర్వాహకులు టివి రెడ్డి తెలిపారు ..వేడుకలలో హోదాతో నిమిత్తం లేకుండా విశ్రాంత ఉన్నత అధికారులతో పాటు సాధారణ ఉద్యోగుల వరకు ఒకే కుటుంబంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో సీనియర్ విశ్రాంత ఉన్నతాధికారి కేవీ రమణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉన్నత అధికారులు కేఎస్ నాగరాజారావు , బి సీతారాం ఆర్టీసీలో అత్యంత సర్వీసు పూర్తి చేసిన విశ్రాంత సీనియర్ ఉద్యోగులు యం.జె.ఎస్ రాజు, బీ సీతారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1967 నుండి ఆర్టీసీలో పనిచేసి విశ్రాంత ఉద్యోగులుగా ఆరోగ్యంగా జీవించి వేడుకలలో పాల్గొనడం అభినందనేయమన్నారు. పాతతరం ఎన్నో అనుభవాలతో ఆర్టీసీని దినదినాభివృద్ధిని చేసిందని ఆనాటి జ్ఞాపకాలు మరువలేమనీ,300 మంది ఉద్యోగులు ఒకే కుటుంబంగా కలసి ఆత్మీయ వేడుకలు జరుపుకోవడం ప్రతి ఒక్కరి జీవితాలను నెమరు వేసుకుంటూ, ఆనంద భాష్పాలతో ఆలింగణం చేసుకునే దృశ్యాలు కంటతడి పెట్టించాయన్నారు . ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగులు ఎం జె ఎస్ రాజు బి సీతారాం గారికి కమిటీ ఘనంగా సత్కరించారు. కమిటీ నిర్వాహకులు కే.ఎస్.సుదీర్, కే .అల్తాఫ్ ,ఏ నరేంద్రరెడ్డి ,బి. విజయ్ కుమార్ ,బి బాలచందర్ ,జి.ఎస్.శంకర్ రెడ్డి ,పి.బాలయ్య ,టిఎన్ రసూల్ ,సి.బి. ప్రసాద్ ,ఎన్. ఆనంద్ ,పాండురంగాచారితోపాటు రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. వేడుకలలో పాల్గొన్న వారందరికీ ఆత్మీయ సమ్మేళనం కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

# సంక్రాంతి కి ప్రత్యేక బస్సులు

## అన్ని బస్సులలో సాధారణ చార్జీలే -ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



**అనంతపురం ఆర్టీసీ, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):**
సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ నుండి 1264 ప్రత్యేక బస్సులను ఈనెల 09 నుండి 19 వరకు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కడప జోన్ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలియచేసారు. నేడు అనంతపురం ఆర్టీసీ రీజనల్ కార్యాలయం నందు అధికారులతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ కు 319, బెంగళూరు కు 353, చెన్నై28, విజయవాడ నగరాలకు 79 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అలాగే అనంతపురం జిల్లా నుండి హైదరాబాద్ కు 33, బెంగళూరుకు 45, చెన్నైకు 2, విజయవాడకు 7 బస్సులు ఏర్పాటు చేయడమైనది. రద్దీని బట్టి అదనపు బస్సులు నడుపుటకు ప్రణాళిక సిద్ధంగా చేశామన్నారు. ప్రత్యేక బస్సులు అన్నింటిలోనూ ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం ప్రారంభం అయ్యిందని, రోజువారీ బస్సులతో పాటూ ప్రత్యేక బస్సులలో కూడ సాధారణ ఛార్జీలే వర్తిస్తాయన్నారు. రాకపోకలకు కలిపి ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే, ఛార్జిలో 10 శాతం రాయితీ వస్తుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు గారు తెలియజేశారు. జిల్లా కు రావలసిన 50 ఎలెక్ట్రిక్ బస్సుల ప్రభుత్వ సహకారంతో త్వరలో జిల్లా కు రావడం జరుగుతుందన్నారు. అలాగే గతంలో మెడికల్ ఆన్-ఫిట్ అయిన డ్రైవర్లకు ప్రత్యామ్యాయ ఉద్యోగం ఆర్టీసీ లోనే కలిపించాలని ప్రభత్వం ఉత్తర్వులు జారి చేసిందని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో జోనల్ ఛైర్మన్ శ్రీ పూల నాగరాజు గారితో పాటూ డి.పి.టి.ఓ. శ్రీమతి కె. శ్రీలక్ష్మి గారు, అనంతపురం డిపో మేనేజర్ బి. మురళీధర్ గారు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హౌసింగ్ బోర్డులో ముగ్గుల పోటీలు

## సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగు ఇవ్వాలి - ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం ప్రతినిధి, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్ ):**
అనంతపురం నగరంలో ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ,బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ,బిజెపి రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు , రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా ఆనందకరమని, బిజెపి యువ నాయకుడికి అశోక్ రెడ్డి గారికి అభినందనలు తెలియజేస్తున్నానని, సంక్రాంతి పండుగ అంటే కేవలం పండుగ మాత్రమే కాదు అని, రైతు ఆరు నెలలు కష్టపడి పండించిన పంట చేతికి వచ్చి కుటుంబం అంతా ఎంతో ఆనందంతో చేసుకొని, అలాగే మన సంస్కృతి ఆచారాలను పాటిస్తూ గంగిరెద్దులతో, గొబ్బెమ్మలతో ఊరంతా సంతోషంగా జరుపుకుంటారని ప్రతి ఒక్కరు పండుగ





రోజు మీ ఇళ్ల ముందు ముగ్గులు వేసి పిల్లలు వారసత్వం సంస్కృతి సంప్రదాయాలు నేర్పించాలని కూటమి ప్రభుత్వం వచ్చాకా ప్రతి ఒక్కరు ఎంతో సంతోషంగా వున్నారని, కుటుంబ వ్యవస్థను కాపాడే విధంగా మాతృమూర్తులు అందరు మీ పిల్లలకు నేర్పించాలని, భారతదేశంలో స్త్రీ కి ఎంతో విలువ ఇస్తారని మీ పిల్లలకు స్త్రీల పట్ల గౌరవం ఇచ్చేలా పెంచాలని, ప్రతి రోజు కుటుంబం తో కలిసి ఒకసారి అయినా భోజనం చేసి మాట్లాడుకోవాలి, పిల్లలతో స్నేహ భావంతో ఉండాలని, పిల్లలో ఆత్మ విశ్వాసం,ఆత్మ స్థైర్యం తో నింపాలని వారు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని, న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ హాస్పిటల్ ఆర్ ఎం ఓ డా. హేమలత , భరత నాట్యం డా.హరిత పాల్గొనున్నారు. గెలుపొందిన వారికి వాషింగ్ మిషన్,కూలర్, డిన్నర్ సెట్, టేబుల్ ఫ్యాన్, ప్రెజర్ కుక్కర్ ఇడ్లీ కుక్కర్, ఐరన్ బాక్స్ వాటర్ హీటర్ మొదటి ఎనిమిది మందికి బహుమతులు అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా కానుకలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మణ్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, చంద్ర,సాయి వివేక్, శ్రీధర్, రవికుమార్, లక్ష్మీ నారాయణ,తరుణ్, కుమార్ అయ్య, చంద్రమోహన్ రెడ్డి, కాటమయ్య, మురళి, రఘు, స్వాతి,వెంకటేష్, వెంకటరాముడు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కుంభాల శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి



**రాయికల్ పట్టణం జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**
మనసున్న మనిషిగారెడ్డి సంఘ నాయకుడిగారైతును రాజును చేసే సేవకుడిగాఉపాధ్యాయ రంగ లీడర్‌గా ఒక్కో అడుగు వేసుకుంటూ వెలుగుతున్నా వేకువ సూర్యుడు శ్రీనివాస్ రెడ్డికి ఆశల పూలతో ఆశయ అండతోఅందరికీ అండదండగా అడుగులేస్తున్నా అప్పుడుజగిత్యాల్ జిల్లా రాయికల్ రత్నమైతండ్రి గంగారెడ్డి హృదయ ముత్యమై సమాజ సేవలో తనదైన శైలిలో చిరునవ్వు దీపమైన ధీరుడు జన్మనిచ్చిన కుంభాల వంశ వైభవము పెంచే...పరిమళ హితుడు రెడ్డి వంశపు... సుమధుర స్నేహితుడు రెడ్డి సంఘ నాయకుడిగా మెరుగైన ప్రగతిని చూపుతున్న మెరుపు సూర్యుడుమట్టిలోని ఆకుపచ్చ చందమామకు తోడుగాకడుపు నింపే అన్నదాతకు అండగాఆపదొస్తే నేనున్నానని అండగా నిలబడే కొండంత ధైర్యశీరేపటి భవితను తీర్చి దిద్దే ఉపాధ్యాయ నాయకుడురేపటి పౌరుల జీవితాల్లో వెలుగునింపే విజ్ఞాన శోధకుడుచదువులమ్మ ఒడిలో సంస్కారాన్ని సమాజానికి పంచే పవిత్ర హృదయుడు మనసున్న మనిషిగారెడ్డి సంఘ నాయకుడిగారైతును రాజును చేసే సేవకుడిగాఉపాధ్యాయ రంగ లీడర్‌గా ఒక్కో అడుగు వేసుకుంటూ వెలుగుతున్న వేకువ సూర్యుడు ఉపాధ్యాయుడు గౌనె శివాజీ రెడ్డి సంఘ అధ్యక్షులు శ్రీనివాసు రెడ్డి కి రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి రాయికల్ సింగల్ విండో మాజీ అధ్యక్షులు గన్నావరం ప్రభాకర్ పడిగే రవీందర్ రెడ్డి దొంతి సతీష్ ఉపాధ్యాయులు ఎండి షంషేర్ గట్టు లక్ష్మి నరసయ్య సుంకే శంకర్ వెంకట్ రమణ మెడికల్ అధినేతలు బుడికే గంగన్న రాజశేఖర్ బత్తిని బాబు గౌడ్ చొప్పదండి నర్సయ్య దురిశెట్టి రంగయ్య గౌనె కాపు శివాజీ రెడ్డి సంఘ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు

# ఘనంగా బుట్టా శివ నీలకంఠ జన్మదిన వేడుకలు

**ఎమ్మిగనూరు, జనవరి, 11,(రిపబ్లిక్ న్యూస్):**
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక భర్త, పార్టీ సీనియర్ నాయకులు మరియు బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ నేడు పుట్టినరోజు సందర్భంగా, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందస్తుగా (11-01-2026) ఎమ్మిగనూరు పట్టణంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీ గుడికల్ అల్తాఫ్, పట్టణ కార్యదర్శి శ్రీ గురువ మాభాష, ముస్లిం సంప్రదాయ పద్ధతిలో టోపీ దరింపజేసి, శాలువాలతో శ్రీ బుట్టా శివ నీలకంఠ ని సన్మానించి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ వేడుకల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షులు ఒ ఎమ్మిగనూరు మునిసిపల్





వైస్ చైర్మన్ శ్రీ డి. నజీర్ అహమ్మద్ , 31వ వార్డు ఇంచార్జ్ శ్రీ పాల శ్రీనివాస్ రెడ్డి , 5వ వార్డు నాయకులు శ్రీ ఇబ్రహీం , ఎమ్మిగనూరు మండల కార్యదర్శి శ్రీ తిమ్మాపురం బజారి , శ్రీ రామాంజినేయులు , శ్రీ ఉరుకుందు , శ్రీ కోట వీరేష్ తదితర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత శోభాయమానంగా నిర్వహించారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తున్న శ్రీ బుట్టా శివ నీలకంఠ కి నాయకులు, కార్యకర్తలు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా వడ్డే ఓబన్న 219వ రాష్ట్ర జయంతోత్సవం

## వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు

**అనంతపురం కార్పొరేషన్, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** మొట్టమొదటి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ రాష్ట్ర జయంతోత్సవ కార్యక్రమం అనంతపురం నగరంలోని లలిత కళాపరిషత్‌లో అట్టహాసంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ గారి ఆధ్వర్యంలో, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గారి సభా అధ్యక్షతన అధికారికంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, బీసీ వెల్ఫేర్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జాయింట్



కలెక్టర్లు, వడ్డెర నాయకులు మల్లెల జయరాం, గోపాలకృష్ణ,అంజినప్ప, వడ్డే సిమెంట్ పోలన్న,హనుమన్న, దలవాయి వెంకటనారాయణ, పెనుగొండ శ్రీనివాసులు, నాగరాజు,కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వడ్డెర సంఘాల నాయకులు, వడ్డెర జాతి బంధువులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే



వెంకటేశులు మాట్లాడుతూ, 2025లో వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించి వడ్డెర్లకు గుర్తింపు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. 2026లో అనంతపురంలో రెండవ అధికారిక రాష్ట్ర స్థాయి జయంతోత్సవం నిర్వహించాలని మంత్రి సవితమ్మ నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.



# విద్యతోనే బీసీల అభివృద్ధికి బాటలు

### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత -వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

### ఒడ్డే ఓబన్న జయంతికి శాశ్వత జీవో జారీ -మంత్రి సవిత -ఘనంగా వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న బిసి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎస్.సవితమ్మ, ఎంపీలు అంబికా, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురము ప్రతినిధి, జనవరి 11,( రిపబ్లిక్ న్యూస్ ):** బ్రిటిష్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ప్రజల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న గారి 219వ జయంతి వేడుకలు ఆదివారం అనంతపురము నగరంలోని లలిత కళా పరిషత్ వేదికగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎస్. సవితమ్మ పాల్గొన్నారు.మంత్రితో పాటు ఈ కార్యక్రమంలో అనంతపురం, హిందుపురం ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ, పార్థసారథి, అర్బన్ ఎమ్మెల్యే, సభాధ్యక్షులు దగ్గుపాటి ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వడ్డర్ల కార్పొరేషన్ చైర్మన్ మల్లెల మురళి, బిసి సంక్షేమ శాఖ సంచాలకులు మరియు వీసీ అండ్ ఎండీ మల్లిఖార్జున, అనంతపురము జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర రావు, దేవళ్ళ మురళి,వడ్డె అంజనప్ప, మల్లెల జయరాం, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు, వడ్డెర సంఘ ప్రతినిధులు, బిసి కులాల ప్రతినిధులు, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి రామ్మోహన్, అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి, బిసి కార్పొరేషన్ ఈడి రామసుబ్బయ్య, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






## బ్రిటీషర్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాటం

ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవిత మాట్లాడుతూ విద్యతోనే బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి చేరుకోగలరని స్పష్టంచేశారు. అనంతపురం నగరంలో ఆదివారం నిర్వహించిన ఒడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీ లు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, వడ్డెర సంఘ నాయకులతో కలసి మంత్రి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటీషర్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన యోధుడు వడ్డే ఓబన్న అని వారు కొనియాడారు. అమరజీవులు వడ్డే ఓబన్న 129 వ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతి రాష్ట్ర వేడుకగా ప్రకటించినప్పుడు మొదటి కార్యక్రమం గుంటూరు నందు నిర్వహించుకున్నామని, ఇప్పుడు మన అనంతపురము జిల్లాలో నిర్వహించుకోవడం, అందరి సహకారం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బిసిలకు గుర్తింపు ఇచ్చిన, అండగా నిలిచిన వారు ఎన్టీఆర్ గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బిసిల సంక్షేమం కోసం మొదట సమావేశం నిర్వహించారని, బీసీల పట్ల నిజమైన నిబద్ధత కలిగిన ప్రభుత్వం ఇదే అని అన్నారు. బిసి మహిళగా ఉన్న తనకు బిసి సంక్షేమ శాఖ మంత్రిగా సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ గారు యువగళం పాదయాత్రలో వడ్డర్లకు ఇచ్చిన హామీ మేరకు వారికి మేలు చేయాలని నిబద్ధతతో వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా శాశ్వతంగా రాష్ట్ర వేడుకగా జరుపుకోవాలని జి.ఓ వచ్చేలా కృషి చేశారని, ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విద్యావంతులుగా అయినపుడే పురోగతి ఉంటుందని తెలుపుతూ, మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, తల్లికి వందనం తదితర విద్యా పథకాలలో ఎక్కువ మంది బిసిలు ఈ విద్యా ఫలాలు వినియోగించుకుంటున్నారని సంతోషంగా ఉందని అన్నారు. వడ్డర్లను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, బిసిలకు ఎంఎస్ఎమ్ఈ పార్కుల కేటాయింపులో రిజర్వేషన్ కల్పిస్తున్నామని అన్నారు. క్వారీలలో 15 శాతం వడ్డర్లకు రిజర్వేషన్ కల్పించడం హర్షించదగినదన్నారు. కూటమి ప్రభుత్వంలోనే బిసిలకు న్యాయం జరుగుతోందన్నారు. ఆదరణ 1,2 ల అమలు చంద్రబాబు నాయుడు గారి హయాంలో జరిగాయని, ఇప్పుడు ఆదరణ 3.ఓ కూడా పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో వడ్డర్లకు పనిముట్లు ప్రాధాన్యతగా అందిస్తామని అన్నారు. బీసీల పక్షపాతి, బీసీలే శ్వాస, బీసీలే ధ్యాస, బీసీల అభివృద్దే అభిలాషగా పని చేస్తున్న మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలల పునరుద్ధరణ పనులు చేపట్టాం, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం అన్నారు. ఒకపక్క సంక్షేమ పథకాలు అందజేస్తూ, ఒక పక్క రాష్ట్రానికి సంపద సృష్టిస్తూ పరిశ్రమలు తీసుకొస్తు మన బిడ్డలకు ఉపాధి చూపించడానికి మన ముఖ్యమంత్రి, మన డిప్యూటీ సీఎం, క్యాబినెట్ మరి ప్రజాప్రతినిధులు అందరూ కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి దశా దిశ మేరకు ఏదైతే జనాభా దామాషా ప్రకారం నిధులు విధులు కూడా కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని, అంతే కాకుండా బీసీల రక్షణ చట్టం కొరకు కూడా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగనంత అభివృద్ధి మన రాష్ట్రంలో జరుగుతున్నదన్న విషయం గుర్తు చేసారు.

బిసి కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ మల్లిఖార్జున మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి వడ్డే ఓబన్న జయంతి వేడుకల సందర్భంగా వడ్డెర్లందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ వడ్డే ఓబన్న గారు తొలి తరం స్వాతంత్ర్య సమర యోధుడు అని, ఆయన త్యాగాలను కృషిని గుర్తించి వారి జయంతిని రాష్ట్ర వేడుకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న వడ్డెరలు వారి స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని పేర్కొన్నారు.

జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ మన జిల్లాలో 219వ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందని అన్నారు. తొలి తరం స్వాతంత్ర్య సమర యోధుడు 1846 జూలై 10న కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయం, ఖజానాపై దాడి చేసి బ్రిటిష్ పాలనలో పీడనకు గురైన రైతులకు పంచి పెట్టిన గొప్ప మహానుభావుడు, సాహసి వడ్డే ఓబన్న అన్నారు. వడ్డే ఓబన్న స్ఫూర్తిగా నిజాయితీకి ధైర్యంగా నిలవడం, పేదలకు అండగా నిలవడం వంటివి కొనసాగించాలని అన్నారు.

ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన రేనాటి వీరుడు అని కొనియాడారు. 1857 సిపాయిల తిరుగుబాటు కన్నా ముందుగానే రైతుల కష్టం దోపిడీకి గురి కాకూడదని, మన దేశ ప్రజలపై బ్రిటిష్ దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని పోరాడారని అన్నారు. సమైక్యంగా మనం అందరం ఏదైనా సాధించుకోవచ్చు అని అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. వడ్డర్లకు ఆదరణ పనిముట్లు అందించడానికి, వడ్డర్లకు మైనింగ్ నందు 15 శాతం రిజర్వేషన్ కల్పించడం వంటి ఎన్నో అంశాలు ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు.

హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ మన జిల్లా బీసీల గడ్డ అని, వడ్డే ఓబన్న గారి 219 వ జయంతి రాష్ట్ర పండుగగా జరుపుకోవడం అదీ మన జిల్లాలో జరుపుకోవడం ఎంతో సంతోషం ఉందన్నారు. వడ్డర్ల యుగపురుషుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. వడ్డర్లు కూడా తాము ఎదిగేందుకు కృషి చేయాలని, విద్యావంతులు కావాలని అన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో, నేడు చంద్రబాబు నాయకత్వంలో పలువురు బీసీలకు, వడ్డర్లకు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో సముచిత స్థానాన్ని కల్పించారని అన్నారు. ఐక్యతగా ఉండి సాధించాలని అన్నారు. ఓబులదేవర చెరువు నందు వడ్డర్లకు కల్యాణ మండపం నిర్మిస్తున్నామని, బి.సి ఎంపీగా తాను కూడా బిసి సంక్షేమం కొరకు కోటి రూపాయలతో కళ్యాణ మండప నిర్మాణాలు పలు చోట్ల చేపడుతున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర రావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బిసిల సంక్షేమ ప్రభుత్వం అని దానికి నిదర్శనమే వడ్డే ఓబన్న జయంతి రాష్ట్ర వేడుకగా ప్రకటించిందని అన్నారు. వడ్డర్ల అభివృద్ధికి మైనింగ్ జీ.ఓ ద్వారా 15 శాతం కేటాయించడం నిదర్శనం అన్నారు. ఓబన్న గారి స్ఫూర్తిగా మనం నడుద్దామని అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న గారి జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు మన అనంతపురము జిల్లాలో జరగడం ఎంతో సంతోషంగా ఉందని, మంత్రి సవిత గారికి ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడి ఉన్న వడ్డెర సోదరుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వారికి పనిముట్లు, మైనింగ్ రిజర్వేషన్ తదితర అంశాలను అమలు చేస్తోందని, పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహం అనివార్య కారణాల వలన ఏర్పాటు కాలేదు అని, వచ్చే సంవత్సరం వడ్డే ఓబన్న గారి విగ్రహావిష్కరణ చేసుకుందామని అన్నారు.

ఎమ్మెల్యే మడకశిర ఎమ్.ఎస్ రాజు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డిన తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న అని, రాష్ట్ర వేడుకగా మన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తన నియోజకవర్గంలో మడకశిర నందు వడ్డే ఓబన్న గారి విగ్రహం తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. వడ్డెరలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని పేర్కొన్నారు.

ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు చైర్మన్, పలువురు వడ్డెర సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ తొలి నాటి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి నేతృత్వంలో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి రైతుల పక్షాన పోరాడారని వారు ఆదర్శనీయులు అని పేర్కొన్నారు.

కార్యక్రమం చివరలో మంత్రి చేతుల మీదుగా పలువురు వడ్డర్లకు సన్మానం చేయగా, మంత్రిని పలువురు వడ్డెర సోదర సోదరీమణులు, అధికారులు సముచితంగా సత్కరించారు.





## ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్
# చలంబాబు సేవలు అభినందనీయం.



**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):**ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ చలంబాబును ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు ఘనంగా సన్మానించారు. నంద్యాల పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చలంబాబు చేస్తున్న దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక సేవలను రాష్ట్ర నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు.
ఈ సందర్భంగా ఐవి సుబ్బారావు మాట్లాడుతూ, చలంబాబు దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆలయ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని, భక్తుల విశ్వాసాన్ని మరింత బలపరిచేలా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఇటువంటి సేవాభావంతో పనిచేసే నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు.అనంతరం నంద్యాల పట్టణ ఏపీ యూడబ్ల్యూజే నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావును సన్మానించారు. అదే విధంగా చలంబాబును కూడా ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, నంద్యాల పట్టణ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుప్పంలో ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు







**కుప్పం జనవరి 11 రిపబ్లిక్ న్యూస్**
స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 219వ జయంతిని కుప్పంలో ఘనంనా నిర్వహించారు. అనంతపురం గ్రంధాలయ చైర్మన్ వడ్డె వెంకట్ నేతృత్వంలో వడ్డెర నాయకులు మాధవ్ అన్న ఆధ్వర్యంలో కుప్పం చెరువు కట్ట వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.
అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటులో ఓబన్న ముఖ్య భూమిక పోషించారని, నల్లమల అడవులలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాన్ని ఊచకోత కోశారని వక్తలు పేర్కొన్నారు. రాబోయే సంవత్సర వడ్డె ఓబన్న జయంతి కార్యక్రమాన్ని వడ్డెర భవనంలో జరుపుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కుప్పంఅబశ్రీశ్రీ నియోజకవర్గంలోని వడ్డెర సంఘం నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## ఏకగ్రీవంగా జాయింట్ సెక్రటరీగా వినోద్ కుమార్ ఎన్నిక



**ఎమ్మిగనూరు, జనవరి, 11(,రిపబ్లిక్ న్యూస్):**
ఏపీ ఎన్జీజీవోస్ కర్నూలులో నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా, ఎమ్మిగనూరు తాలూకాలో వినోద్ కుమార్ ను జాయింట్ సెక్రటరీగా సంఘం ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు తాలూకా ప్రెసిడెంట్ మద్దిలేటి, సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ తిరుమల రెడ్డిలకు సంఘ సహచరులు శుభాకాంక్షలు తెలిపారు.తనకు ఇచ్చిన పదవికి కృతజ్ఞతలు తెలుపుతూ,ఎమ్మిగనూరు తాలూకా ఏపీఎన్జీవోస్ తమపై ఉంచిననమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వినోద్ కుమార్‌తెలిపారు.

# దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ

### దివ్యాంగుల సంక్షేమ సంఘం సేవలు ప్రశంసనీయం:వెదుర్ల రామచంద్రారావు.

### దివ్యాంగుల సేవలు నిరంతరం కొనసాగుతాయి; డాక్టర్ రవి కృష్ణ





**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):**నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు సౌజన్యంతో 20 మంది దివ్యాంగులకు 15 వేల రూపాయల విలువ చేసే నెలవారి మందులను పంపిణీ చేశారు.నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెదుర్ల రామచంద్రరావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ పాల్గొని ప్రసంగించారు.వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా దివ్యాంగులకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే దివ్యాంగులకు నెలవారి మందులను కొనుగోలు చేసి గత 20 సంవత్సరాలుగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సేవలు నిరంతరం కొనసాగుతాయని, నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల ఐఎంఏ వైద్యుల సహకారంతో, పట్టణ ప్రముఖుల సహకారంతో గత 24 సంవత్సరాలుగా వేలాది దివ్యాంగులకు సహకారం అందించామన్నారు.ఇదే కార్యక్రమంలో హైదరాబాద్ సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న సుష్మ వచ్చే నెలలో దివ్యాంగులకు నెలవారి మందుల కోసం 9 వేల రూపాయల విరాళాన్ని దివ్యాంగుల సంక్షేమ సంఘానికి అందజేశారు.ఈ సందర్భంగా గత రెండు దశాబ్దాలుగా దివ్యాంగులకు సహకారం అందిస్తున్న వెదుర్ల రామచంద్రరావు,వర్ధంశెట్టి రాజారామ్,ఈరోజు విరాళం అందజేసిన సుష్మ లను దివ్యాంగుల సంక్షేమ సంఘం తరఫున ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో , జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య,నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్,దివ్యాంగుల ఉద్యోగుల విభాగం అధ్యక్షులు కిషోర్, కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి, బాలచంద్రుడు, సుష్మ , కార్యాలయ కార్యదర్శులు అలా మధు,వెంకటేశ్వర్లు, సూర్య పాల్గొన్నారు

# సంజన్న కుటుంబానికి న్యాయం చేయాలి

### -- మందకృష్ణ మాదిగ డిమాండ్ -హత్యకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి,

### కుటుంబానికి తక్షణ భద్రతతో పాటు ప్రభుత్వ బెనిఫిట్స్ కల్పించాలి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 11)**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కర్నూలు జిల్లాలో పర్యటించారు. కర్నూలు నగరంలోని శరీన్ నగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నేత సంజన్నను 2025 మార్చి 14న దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మందకృష్ణ మాదిగ శరీన్ నగర్‌కు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంజన్న హత్యకు పాల్పడిన నిందితులపై పీడీ యాక్ట్ విధించాలని పోలీసులను డిమాండ్ చేశారు. అలాగే, సంజన్న కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తక్షణ భద్రత కల్పించాలని కోరారు.హత్య జరిగి సంవత్సరం రోజులు గడుస్తున్నప్పటికీ, ఎస్సీ/ఎస్టీ చట్టాల ప్రకారం బాధిత కుటుంబానికి అందాల్సిన ప్రభుత్వ ఉద్యోగం, భూమి, ఇల్లు నిర్మాణానికి సంబంధించిన బెనిఫిట్స్ ఇప్పటికీ అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే సంజన్న కుటుంబానికి అన్ని ప్రభుత్వ సదుపాయాలు కల్పించాలని కోరారు.దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, దళితులపై దాడులు చేస్తే కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకునే విధంగా కొత్త చట్టాలు తీసుకురావాలని మందకృష్ణ మాదిగ అన్నారు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు.

# నంద్యాలలో లయన్స్ క్లబ్ జోనల్ సదస్సు.

### లైన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ అధ్యక్షతన నిర్వహణ. -సదస్సు ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఏవిఆర్ ప్రసాద్.

### సేవా కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి: డాక్టర్ రవి కృష్ణ





**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):**
లయన్స్ క్లబ్ జిల్లా 316 జె లో ఐదవ జోన్ సదస్సు ఆదివారం నంద్యాలలో స్థానిక రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సదస్సులో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ ల కౌన్సిల్ మాజీ చైర్మన్ ఏ.వి.ఆర్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు.జోన్ లో ఉన్న నంద్యాల,ఆదోని, బేతంచెర్ల,నంద్యాల సేవా ప్రగతి లయన్స్ క్లబ్ లకు చెందిన అధ్యక్ష ,కార్యదర్శులు, కోశాధికారులు,వివిధ హోదాలలో బాధ్యతలు చేపట్టిన నాయకులు పాల్గొన్న ఈ సదస్సులో జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ మాట్లాడుతూ జోన్ లో ఉన్న అన్ని క్లబ్బులలో సేవా కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఇదేవిధంగా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.ఏ.వి.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ సేవలు వివిధ రంగాలకు విస్తృతం చేయాలని అన్నారు.లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ పేదల కోసం వైద్య శిబిరాలు, దివ్యాంగుల సేవలు, విద్యా సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థకు పేరు తీసుకురావాలని కోరారు.సదస్సులో భాగంగా "సేవా- నాయకత్వం" అన్న అంశంపై డాక్టర్ గెలివి సహదేవుడు, "సేవా కార్యక్రమాల రూపకల్పన - నిర్వహణ" అంశంపై డాక్టర్ రవి కృష్ణ, "లయన్స్ క్లబ్ ల సంస్థాగత పరిపాలన" విషయంపై బవిరి శెట్టి శ్రీకాంత్," అంతర్జాతీయ లయన్స్ పోర్టల్ లో సేవా కార్యక్రమాల నివేదిక ఇచ్చే విధానం" పై రవి ప్రకాష్,"అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఫౌండేషన్ విధివిధానాలు" గురించి పెసల శ్రీకాంత్ సభ్యులకు వివరించారు.పాల్గొన్న లయన్స్ క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు ఆయా క్లబ్ ల లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు నివేదికలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, ఆడిటర్ వంకదారి గోపాలకృష్ణమూర్తి,ఎం.పీ.వి. రమణయ్య,కశెట్టి చంద్రశేఖర్, గోళ్ల సుదర్శనం శెట్టి , సభ్యులు పాల్గొన్నారు.

# త్వరలో బారీ మెగా క్యాంప్

### ఆదివారం ఉచిత వైద్య శిబిరం భారి సక్సెస్.

### కొద్ది వారాలలోనే అతి పెద్ద శిబిరం.ఉచిత వైద్య శిబిరాలు శాశ్వతం

### -సాయి బాలాజీ నర్సింగ్ హెూమ్ అధినేతలు డాక్టర్ హరి నాథ్ రెడ్డి ,డాక్టర్ లక్ష్మీ ప్రసన్న.



**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):**నంద్యాల జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ నర్సింగ్ హెూమ్ దగ్గర డా.హరినాథ్ రెడ్డి, డా లక్ష్మీ ప్రసన్న ల ఆధ్వర్యం లో ఆదివారం ఉదయం నిర్వహించిన ఉచిత ఊపిరి తిత్తులు,ఆస్తమా రోగాల నివారణ శిబిరం జరిపారు... ఇందులో ఉచితంగా 2డి ఎకో తోపాటు ECG , షుగర్, బీపీ టెస్టులను రోగులకు చేశారు... ఈ నాలుగు టెస్ట్ ల విలువ రూ 2వేలు ఉంటుందని అంచనావేస్తున్నారు... దాదాపు మూడు వందల మంది కి పైగా టెస్టు లు,మరో 4వందల మందికి అస్తమా,ఊపిరి తిత్తులు వ్యాధి టెస్టులు చేసి వారికి ఉచితంగా ఖరీదైన మందులు అందజేశారు..ఈ శిబిరంలో హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ చెస్ట్ డాక్టర్ రవీంద్ర,IMA నంద్యాల శాఖ అధ్యక్షులు డా మాధవి రెడ్డి, డా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం త్వరలో భారి మెగా క్యాంప్ జరపడానికి సన్నాహాలు చేస్తున్నామని,30 ఏళ్ళనుంచి 200కు పైగా ఉచిత వైద్య శిబిరాలు జరిపి వేలాది మందికి మేలు చేశామని అన్నారు.భవిష్యత్తులో కూడా ఉచిత వైద్య పరీక్షలు,మందులు అందజేసే శిబిరాలు జరుపుతామని ఐతీ హరినాథ్ రెడ్డి,లక్ష్మీ ప్రసన్న లు తెలిపారు. భారి ఎత్తున రోగులు హాజరైన ప్రతి ఒక్కరికి డాక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు...

# నేడు ఘనంగా స్వామీ వివేకానంద జయంతి వేడుకలు.




**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):**
నేషనలిస్ట్ ఎలైట్ ఫోరం ఆధ్వర్యంలోభారతదేశము గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన
శ్రీ స్వామి వివేకానంద జయంతిని లిసౌజన్య ఫంక్షన్ హాల్ లో జనవరి 12 సోమవారం సాయంత్రం 5 నుండి 7:30 వరకు చేస్తున్న కార్యక్రమం గురించి ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.వందేమాతరం గీత రచన జరిగి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా పూర్తి వందేమాతరం గీతాన్ని అందరం కలిసి పాడడానికి ఏర్పాట్లు చేశారు.మన స్వేచ్ఛ వాయువుల కోసం తమ జీవితాలను పణంగా పెట్టిన మహిళా స్వతంత్ర సమరాంగనల చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. రాకా లోకం యూట్యూబ్ నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ లిరాకా సుధాకర్ గారు వక్తగా వస్తున్నారు.అందరం ఒకటే ఆలోచన అన్న భావన కోసం మగవాళ్ళు తెల్లచొక్కా, మాతృమూర్తులు ఎరుపు రంగు ఛాయ (షేడ్) ఉన్న చీర తో రావాలని నిర్వాహకులు విన్నపించారు.మన బాధ్యత గా స్వతంత్ర సమరాంగనలకు నివాళులర్పించడానికి ప్రతి ఒక్కరూ లికొన్ని పూలు కాగితంలో చుట్టుకుని వద్దాం (ప్లాస్టిక్ కవర్ వద్దు).
ఈ కార్యక్రమంలో నేషనలిస్టు ఎలైట్ ఫోరం కన్వీనర్ డాక్టర్ నేట్ల మహేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ లు గెలివి శ్రీకాంత్, చాటకొండ శ్రీకాంత్, రాంప్రసాద్ గారు, డాక్టర్ సంతోష్, యాతం చంద్రమౌళీశ్వర్ రెడ్డి, భవానీ సింగ్, సంపత్ గారు పాల్గొన్నారు.

# ఈద్గా పునఃనిర్మాణానికి భూమి పూజ



**అవుకు జనవరి 11 రిపబ్లిక్ (న్యూస్)**నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో ఆదివారం పట్టణ శివారులోని నవాజ్ కొండ వద్ద పునఃనిర్మాణం జరుగుతున్న ఈద్గాకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.
ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో అవుకు గ్రామ ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ముస్లిం సోదరులకు ఎప్పుడైనా, ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# అట్టహాసంగా ప్రారంభమైన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

**చౌడేపల్లి ప్రతినిధి జనవరి 11 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ డి రాజులూరు సమీపంలో గల ఏ కొత్తకోట వద్ద ఉన్న ఎం నారాయణరాజు మెమోరియల్ క్రికెట్ గ్రౌండ్ నందు ఆదివారం కేపీఎల్ టోర్నమెంట్ను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్షత్రియ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ను నిర్వహించడం గత 13 సంవత్సరాలుగా జరుగుతుంది.ఇందులో భాగంగా 11వ సీజన్లో ఘనంగా ప్రారంభించారు. తొలుత క్షత్రియ ప్రముఖులు ఒకరినొకరు మైదానంలో ఆప్యాయంగా పలకరించుకున్నారు. నూతనంగా ఏర్పాటు అయిన కేపీఎల్ ట్రస్ట్ సభ్యులు వై శ్రీనివాసరాజు ,ఎస్ పురుషోత్తం రాజు ,ఎన్ సుదర్శన్ రాజు, ఎన్ పురుషోత్తమరాజు, అనిల్ కే శ్యామరాజు, సుబ్రహ్మణ్యం( మనీ) రాజు, ఎస్ శ్రీనివాసరాజు, లతోపాటు క్షత్రియ ప్రముఖులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షత్రియ




యువతి ,యువకులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా మాదిరాజు వెంకటరమణ రాజు పిలుపునిచ్చారు. అదే విధంగా కేపీఎల్ ట్రస్ట్ మరిన్ని సేవలు అందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. క్షత్రియ యువత క్రీడల్లో రాణించాలని ఆయన కోరారు. అనంతరం పూజా కార్యక్రమం క్షత్రియ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సుదర్శన రాజు, పురుషోత్తమ రాజులు మైదానంలో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. కేపీఎల్ లో పలు



టీముల మధ్య మొదటి రోజున హెూరాహెూరీగా పోటీలు జరిగాయి. సమాజంలో క్షత్రియుల పాత్రలను గురించి పలువురు ప్రముఖులు సభలో ప్రసంగించారు. అనంతరం ఆసక్తిగా క్రికెట్ పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మాదిరాజు లక్ష్మీపతి రాజు, భక్తవత్సల రాజు ,శ్రీధర్ (గిరి)రాజు ,రెడ్డప్ప రాజు, శంకర్ రాజు, పుంగనూరు, చౌడేపల్లి కి చెందిన పలువురు క్షత్రియ ప్రముఖులు పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో జనసేన పార్టీ ఇంచార్జి చిన్న రాయల్



**చౌడేపల్లి ప్రతినిధి జనవరి 11 రిపబ్లిక్ న్యూస్** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మను పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి సిరి వేలు గంగాధర్( చిన్నా రాయల్) కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేద ఆశీర్వాదం పవిత్ర తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. ఆలయంలో పలు అవకతవకలు జరుగుతున్నాయి అన్న విషయం తన దృష్టికి వచ్చిందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ అధికార సిబ్బంది సేవలు అందించారు.

## గడ్డం వారి పల్లి లో ఘనంగా గంగ జాతర

**చౌడేపల్లి ప్రతినిధి జనవరి 11 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని పంచాయితీ కేంద్రం గడ్డం వారి పల్లిలో ఆదివారం గంగజాతలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మండలం రోజుల క్రితం బోయకొండ గంగమ్మకు ఆలయాన్ని నిర్మించి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గిరిగలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతకు మహిళల ఆధ్వర్యంలో పిండి దీపారాధన వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బోయకొండ గంగమ్మ ఆలయ నిర్మాణ కర్త గిరిబాబు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



## జడ్పీటీసీ రెసులో సురేష్ ఎర్వుల

**11 జనవరి 26 (రిపబ్లిక్ న్యూస్ )**
హత్నూర : హత్నూర జడీపీటీ యసి రిజర్వుడు వస్తే తాను కూడా పోటీలో ఉంటానని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య సహచరుణిగా పోటీలో ఉంట్టానని ఒక ప్రకటనలో తెలిపారు మండలంలో తన క్యాడర్ని అడిగి తెలుసుకున్నారు మీరు పోటీలో ఉండటం మాకు చాలా సంతోషం అని ఆనందాన్ని వ్యక్తం చేశారు మీ గెలుపుకు తనవంతు కృషి చేస్తామని మాటిచ్చారు



## సిరి క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 11( రిపబ్లిక్ న్యూస్ )**
వట్పల్లి మండలంకేంద్రం లో ఆదివారం సిరి క్యాలెండర్ను రాయికోడ్ మండల్ ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాచూర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజలు--ప్రభుత్వం మధ్య వారే వారధులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరి రిపోర్టర్ జెల్ల భాగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ జోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నే ఈశ్వరయ్య, గౌరెకల్ గ్రామ సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి, పత్రి విట్టల్తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని సిరి క్యాలెండర్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు.

## సిరి దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ.

**-వట్టిపల్లి ఎస్సై లవ కుమార్.**

**అందోల్ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్ )**
వట్టిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై లవ కుమార్ చేతుల మీదుగా సిరి క్యాలెండర్ ఆవిష్కరణ చేశాడు. ఈ కార్యక్రమంలో సిరి రిపోర్టర్ జెల్ల బాగయ్య, బుచ్చయ్య, దాసయ్యా, తదితరులు పాల్గొన్నారు.




## ఊరి బాగు కోసం శ్రీమంతుడు లా వస్తున్న. -తుడుం అశోక్.

**అందోల్ జనవరి 11 (రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఐదో వార్డ్ కౌన్సిలర్ భరిలో ఊరు బాగుకోసం తన భవిష్యత్తు ప్రజలకు అంకితం చేస్తానని ఒక శ్రీమంతుడిలా వస్తున్నానని ఆయన అన్నారు.
నా ఊరే నాకు బలం ప్రజలే నాకు బలగమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల పైన ఉన్న నమ్మకమే నన్ను నా ఊరు గ్రామం బాగుండాలని ఉద్దేశంతో మీ ముందుకు వచ్చి మన వాడు అభివృద్ధికై మీ ముందుంటానని తుడుం అశోక్ అన్నారు. ఈసారి మున్సిపల్ ఎలక్షన్లో ఐదో వార్డ్ కౌన్సిలర్ బరిలో నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే మంచి చెడు కష్టసుఖాలలో ముందుండి ప్రజాసేవకై నా జీవితాన్నే అంకితం చేస్తానని ఆయన అన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా స్పందిస్తూ ఎన్నికల కోసమే కాదు నా ప్రజల కోసమే వస్తున్నా అని , అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని ఒక శ్రీమంతుడు లా వస్తున్న ఆశీర్వదించండి అని తుడుం అశోక్ అన్నారు.



# వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

### ముఖ్య అతిథులు రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్

### గుత్తి సబ్ జైల్ సూపర్డెంట్ మహేశ్వరుడు

**గుత్తి జనవరి 11 (రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు వడ్డే ఓబన్న 219 వ జయంతి సందర్భంగా, ముఖ్య అతిధులు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ గుత్తి సబ్జెక్టు సూపర్డెంట్ మహేశ్వరుడు, ముందుగా వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటున్నే ప్రథమ స్వతంత్రం యుద్ధం అంటారు కానీ అంతకుముందు 1846 లో తెలుగు నాట ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి తో కలిసి బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగు వారి ఆత్మ గౌరవం నిలపడం కోసం వీరోచితంగా పోరాడారు వడ్డే ఓబన్న ఆనాటి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న



చరిత్రను నేటి తరాలకు తెలియచేలనే ఉద్దేశంతో ఓబన్న జయంతిని ఈ కూటమి ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తుంది తెలియజేశారు మహేశ్వరుడు మాట్లాడుతూ, వడ్డెర కులంలో పుట్టిన ఓబన్న మొదటి స్వాతంత్ర్య సమర యోధుడు, ఓబన్న ఆయన మన కులంలో పుట్టడం మన అదృష్టం, మనకు చదువు ముఖ్యమని, చదవడం వల్లనే, మన, పిల్లల జీవితాలు బాగుపడతాయని, అందుకు నేనే ఉదాహరణ అని, వడ్డెరు లు అందరు కలిసి ఐకమత్యం గా ఉంటేనే ఏదైనా సాధించగలం అని తెలిపారు, , ఈ విషయం మీద ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమం లో సూర్య వంశ వడియారాజులు సంఘం అధ్యక్షులు పీట్ల చిరంజీవి, పట్టణ అధ్యక్షులు, దేరంగుల తిరుపతయ్య, ఉపాధ్యక్షులు హనుమంతు, సెక్రటరీ సర్పంచ్ చంద్ర, నాగరాజు, మునేష్, సుధాకర్, తొండపాడు రామాంజి, రాజు పోతురాజు చిన్న ఆంజనేయులు హరి కుమార్ కోలన్న వీరాంజి వెంకటేష్ యువ వడ్డెర చెర్లోపల్లి యూత్ వడ్డెర కుల బంధువులు పాల్గొన్నారు

# ఓర్వకల్లుకు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు కృషి

### సెయింట్ జోసెఫ్ కాలేజీలో వి.పి.ఎల్--9 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 11)**
కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వాసవి ప్రీమియర్ లీగ్--9 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పోటీల విజేతలకు మంత్రి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాసవి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కర్నూలుకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా క్రీడా పోటీలు నిర్వహించేలా నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు.కర్నూలు అభివృద్ధి కోసం తాను నిరంతరం పనిచేస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా తాను కర్నూలులో అందుబాటులో లేనని అడిగితే, మంత్రిగా ఇతర రాష్ట్రాలు, దేశాలు తిరిగి పెట్టుబడులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అర్థమయ్యేలా చెప్పాలని వ్యాఖ్యానించారు. తాను ఎక్కడ ఉన్నా కర్నూలు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తున్నానని తెలిపారు.ఓర్వకల్లును పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ పరిశ్రమలను తీసుకువస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధీర్, శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూధర్మ పరిరక్షణే ఆర్. ఎస్. ఎస్ ధ్యేయం...

### యువత స్వామి వివేకానంద లా తయారవ్వాలి... -ఆర్. ఎస్. ఎస్ ధర్మపురి ఖండ కార్యవాహ్ శ్రీకాంత్ జీ....

**రాయికల్ పట్టణశీ జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**
హిందూ సమాజం చాలా గొప్పదని ప్రతి హిందువు తన బాధ్యత తెలుసుకోవాలని ఒక బీద కుటుంబం నుంచి వచ్చిన పరమపూజనీయ డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్ 1925 లో విజయధశమి రోజున సంఘాన్ని స్థాపించి నేటికి 100 సంవత్సరాలు పూర్తయ్యాయని రాయికల్ లో ఆర్. ఎస్. ఎస్ ధర్మపురి ఖండ కార్యవాహ్ శ్రీకాంత్, ఇటిక్యాల లో రాయికల్ ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్ లు అన్నారు. రాయికల్, ఇటిక్యాల లో ఆర్. ఎస్. ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాతి ఉత్సవం, వివేకానంద జయంతి లలో వారు పాల్గొని మాట్లాడుతూ ఆర్. ఎస్. ఎస్ నిత్యశాఖ మాధ్యమంగా వ్యక్తి నిర్మాణే ధ్యేయంగా పని చేస్తుందని, శతజయంతి ఉత్సవాల సందర్భంగా హిఃదూ సమాజంలో పంచపరివర్తన్ ద్వారా సనాతన ధర్మాన్ని, దేశాన్ని, ప్రకృతిని పరిరక్షించుకోవచ్చని అన్నారు. సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని, స్వతంత్ర పోరాటంలో ఆర్.ఎస్.ఎస్ కూడా పాల్గొన్నదని, జగద్గురు ఆదిశంకరాచార్యులను, భగవద్ రామానుజులను హిందువులందరూ కూడా ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. సంక్రాంతి పండుగ దక్షిణాయన



పుణ్యం కాలం నుండి ఉత్తరాయన పుణ్య కాలం మొదలవుతుందని, సంక్రాశీతి ని రైతులందరూ కూడా సంతోషంగా జరుపుకునే పండుగలలో సంక్రాంతి ఒకటని పండుగ విశిష్టతను, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశాల గురించి కూడా తెలియజేశారుహిందువులంతా సంఘటితం కావాలని తెలియజేశారుఈ కార్యక్రమం లో రాయికల్ 110 మంది, ఇటిక్యాలలో 14 మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# శ్రీశైలం ప్రాజెక్టు విధి విధానాలను అమలు చేయండి

## గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం తక్షణమే చేపట్టండి

**తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు అందించే నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వండి.**

**రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజీ నిధులను రాయలసీమలో చెరువులు అభివృద్ధికి మాత్రమే వినియోగించండి.**

**శ్రీశైలం ప్రాజెక్టు నుండి విద్యుత్ ఉత్పత్తి పేరుతో రాయలసీమ నీటి హక్కులను కాలరాయకండి.- బొజ్జా దశరథరామిరెడ్డి**




**నంద్యాల, జనవరి రిపబ్లిక్ న్యూస్):** రాజకీయాలకతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటిని సద్వినియోగం చేసుకోవాలన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల ప్రకటనను స్వాగతిస్తున్నామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామి రెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటిని సద్వినియోగం చేసుకుందాం అంటూనే, "రాయలసీమ ఎత్తిపోతల పథకం వలన ప్రయోజనం లేదు" లేదా "పోలవరం--నల్లమలతోనే సీమ సస్యశ్యామలం" వంటి ప్రకటనలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చేస్తున్న సందర్భంలో ఆదివారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటిని సద్వినియోగం చేసుకుందాం లాంటి ప్రకటనలు గత ప్రభుత్వంలో కూడా వచ్చినప్పటికీ కార్యాచరణ లేకపోయిందని గుర్తు చేస్తూ, ఈసారి అయినా రెండు వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, దక్షిణ తెలంగాణ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ జరుగుతుందని బొజ్జా ఆశాభవం వ్యక్తపరిచారు. శ్రీశైలం ప్రాజెక్టు విధి విధానాలను కఠినంగా అమలు చేయకుండా గోదావరి జలాలను ఎటు మళ్లించినా రాయలసీమకు ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని నిరంతరం దిగువకు వదిలే విధానాన్ని తక్షణమే నిలిపివేసి, నాగార్జునసాగర్‌కు కేటాయించిన నీటితో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేయాలనే నిబంధనను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన నీటిని శ్రీశైలంలో నిల్వ ఉంచి రాయలసీమ, దక్షిణ తెలంగాణ అవసరాలకు వినియోగించాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పూడిక కారణంగా ఇప్పటికే సుమారు 90 టీఎంసీల నిల్వ సామర్థ్యం తగ్గిందని, భవిష్యత్‌లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకుండా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతో పూడిక నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. నికర జలాల హక్కులు ఉన్న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ ఎల్ సి ), కేసీ కెనాల్, తెలంగాణలోని ఆర్డీఎస్ ప్రాజెక్టు స్థిరీకరణ కోసం గుండ్రేవుల రిజర్వాయర్ డిపిఆర్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుమతులు పొందిన విషయాన్ని గుర్తు చేస్తూ, రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు కీలకమైన ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గాలేరు--నగరి, హంద్రీ--నీవా, తెలుగుగంగ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు అందేందుకు అవసరమైన అనుబంధ పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటల పునరుద్ధరణ అత్యంత కీలకమని పేర్కొంటూ, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక నిధులను రాయలసీమలోనే పూర్తిగా వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ నిధులను "పోలవరం – నలమల సాగరు, "పూర్వోదయ", తదితర ప్రాజెక్టులకు మళ్లించడం సరికాదని స్పష్టం చేశారు. "రాయలసీమ ఎత్తిపోతల పథకం వలన ప్రయోజనం లేదు" లేదా "పోలవరం--నల్లమలతోనే సీమ సస్యశ్యామలం" వంటి ప్రకటనలను పక్కనబెట్టి, ముందుగా శ్రీశైలం విధి విధానాల అమలు, గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, రాష్ట్ర విభజన చట్టం అనుమతించిన గాలేరు--నగరి, హంద్రీ--నీవా, తెలుగుగంగ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు అందేలాగా అనుబంధ సాగునీటి పనులపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి బొజ్జా దశరథ రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, మహేశ్వరరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.




# వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా

## ఘన నివాళులు అర్పించిన నంద్యాల జిల్లా పోలీసులు



**నంద్యాల క్రైం, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, ధైర్య సాహసాలకు ప్రతీక అయిన వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు మాట్లాడుతూ, వడ్డే ఓబన్న సామాజిక న్యాయం, స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని ఆయన ధైర్యం, త్యాగం నేటి తరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. సామాజిక సమానత్వం, న్యాయం కోసం వారు చేసిన పోరాటం ప్రతి ఒక్కరినీ ప్రేరేపించేదిగా ఉందని అన్నారు. వడ్డే ఓబన్న ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తో పాటు జిల్లా సాయుధబలగాల డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్, సురేష్ బాబు,జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొని వడ్డే ఓబన్న సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు,

# నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి - పోలీసు అధికారులు**





**నంద్యాల క్రైం, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

## నంద్యాల జిల్లాలో నాలుగు పోలీసు స్టేషన్ ల పరిధులలో

# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్

**శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు పోలీసులు అందగా ఉంటారని భరోసా కల్పించేందుకు నిరంతరం కొనసాగుతాయి**

**జిల్లాలో చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పోలీస్ యంత్రాంగం**

**సరైన ధ్రువపత్రాలు లేని 25 మోటార్ సైకిళ్లు, 77 క్వాటర్ బాటిల్లు,02 బీర్లు, 25 లీటర్ల నాటుసారాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంశం**

**శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**





**నంద్యాల క్రైం, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నాలుగు పోలీసు స్టేషన్ ల పరిధులలో అనగా నంద్యాల తాలూకా, ముచ్చుమర్రి, నందికొట్కూర్ టౌన్,ఆత్మకూరు టౌన్, పోలీసు స్టేషన్ ల పరిదులలో ఆయా పోలీసు అదికారులు ఆరి సిబ్బంది సహాయంతో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అనుమానితులు, నేరచరిత్ర గలవారు,రౌడీషీటర్లు మొదలగు వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అక్రమ మద్యంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 25 మోటార్ సైకిళ్లు, అక్రమ మద్యం 77 క్వాటర్ బాటిల్లు,02 బీర్లు, 25 లీటర్ల నాటుసారాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చెయ్యడం జరిగింది. 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంశం చెయ్యడం జరిగింది. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను నివారించడమే లక్ష్యంగా, ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా నివారించుటకు, పోలీసులు ప్రజల కొరకు ఉన్నారనే భరోసా కల్పించడం కొరకు ఈ కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లు తరచూ నిర్వహించడం జరుతుందని పోలీసు అదికారులు తెలిపారు. అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి గొడవలకు అల్లర్లకు వెళ్లకుండా ఐకమత్యంగా జీవించాలని, ఏదైనా సమస్య ఉంటే ముందుగా పోలీసు వారిని సంప్రదించాలని తద్వారా సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని, ప్రస్తుతం సమాజంలో జరిగే సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని, కొత్త చట్టలపై అవగాహన కల్పించడం జరిగింది. అత్యవసర సమయంలో వినియోగించవలసిన టోల్ ఫ్రీ నంబర్ల గురించి అనగా మహిళలకు వివరిస్తూ చైల్డ్ మ్యారేజ్ కు సంబంధించి 1098, సైబర్ క్రైమ్ కు సంబంధించి 1930 , ఎమర్జెన్సీ డయల్ 100,112, నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని తెలియజేశారు.

# ఎపి యు డబ్ల్యుజె 11వ ప్లీనరీ ని జయప్రదం చేయండి

**-ఎపి యు డబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు.**



**నంద్యాల బ్యూరో, జనవరి 11,(రిపబ్లిక్ న్యూస్):** విజయవాడలో ఫిబ్రవరిలో ప్రతిష్టాత్మకంగా జరిగే 11వ ప్లీనరీని జయప్రదం చేయాలని ఎపి యు డబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. ప్లీనరీ జయప్రదంలో భాగంగా ఆదివారం ఆయన నంద్యాలకు వచ్చారు. శోభా ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా ఏళ్ల తర్వాత విజయవాడలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ 11వ ప్లీనరీని నిర్వహించబోతున్నామన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో తుమ్మలపల్లి క్షేత్రంలో ఈ ప్లీనరీని నిర్వహించబోతున్నామన్నారు. ఈ ప్లీనరీకి దేశంలోని 28 రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనబోతున్నారన్నారు. అలాగే 6 దేశాల జర్నలిస్టు ప్రతినిధులు కూడా హాజరుకాబోతున్నారన్నారు. ఇంత ప్రతిష్టాత్మకంగా జరగబోతున్న ప్లీనరీ జయప్రదం కోసం ప్రత్యేక సావనీర్ వేస్తున్నామని చెప్పారు. ఈ సావనీర్ లో IJU చరిత్ర, పోరాటాలు, ఉద్యమాలు, దేశవ్యాప్త సీనియర్ నేతల అనుభవాలు తదితర అంశాలతో సావనీర్ ముద్రిస్తున్నట్టు చెప్పారు. ఈ సావనీర్ కు ప్రకటనలు ఇచ్చే ప్రకటనలు దేశవ్యాప్తంగా తెలుస్తుందన్నారు. కనుకఎపి యు డబ్ల్యుజె నేతలు పెద్ద సంఖ్యలో ప్రకటనలు సేకరించి సావనీర్ జయప్రదానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి యు డబ్ల్యుజెరాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్ లాల్, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, ఉస్మాన్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు చలంబాబు, కడప జిల్లా నాయకులు శ్రీనాథ్ రెడ్డి, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు మద్దిలేటి నంద్యాల జిల్లా నాయకులు రాజ్ కుమార్ రెడ్డి, నూర్ భాష, అరుణ్, సుబ్బయ్య , వాసు నాగేంద్ర నూర్ తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ దళిత విద్యార్థి మృతి



**మహానంది, జనవరి11, (రిపబ్లిక్ న్యూస్ )** వారం రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక దళిత విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గోస్పాడు మండలం, సాంబవరం గ్రామానికి చెందిన పులి ప్రతాప్ కుమారుడు విజయ్ కుమార్(13)మహానంది లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీన తోటి విద్యార్థులతో ఆడుకుంటూ ప్రమాద వశాత్తు కిందపడటంతో ఇనుప కడ్డీలు తలకు కుచ్చు కొని గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు మహానంది ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.విద్యార్థి మృతి చెందడంతో ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు.



# మోటార్ సైకిల్ కు నిప్పు

**మహానంది, జనవరి11,( రిపబ్లిక్ న్యూస్.)** మహానంది మండలంలోని గోపవరం గ్రామంలో మోటార్ సైకిల్ కు నిప్పు పెట్టినట్లు బాధితుడు గుర్రం మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఎస్సీ కాలనీలోని తన ఇంటి ముందు ఉంచిన మోటర్ సైకిల్ ను శనివారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ కు నిప్పు పెట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో తాము ఇంట్లో నిద్రిస్తున్నామని కాలిన వాసన మంటలతో కూడిన శబ్దం రావడంతో బయటికి వచ్చి చూసేసరికి మోటార్ సైకిల్ కు మంటలు వ్యాపించినట్లు బాధితుడు తెలిపారు. గ్రామంలో తరచూ ఏవో ఒకటి సంఘటనలు చోటు చేసుకోవడం తో పోలీసులకు తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## మొగిలిపేట్ గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు.



**మల్లాపూర్ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండలం మొగిలిపేటగ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఆదివారం రోజున సర్పంచ్, ఉప సర్పంచ్ నేతృత్వంలో గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్,వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తిని, ప్రోత్సహించాలని, ఐక్యత ఆరోగ్యాన్ని పెంపొందించేందుకుఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని సర్పంచ్ కళ రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం గ్రామానికి చెందిన 8 క్రికెట్ జట్లు 12 వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోల్కొండ కళ రమేష్, ఉప సర్పంచ్ దండవేని రాజేందర్ వార్డు సభ్యులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు యేలేటి జలపతి రెడ్డి ,వీడీసీ చైర్మన్ వంగ శ్రీనివాస్,మరియు వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పార్టీ జోగిపేటలో 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బరిలో.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రఫీక్.

**అందోల్ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్)**



అందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డ్ నుండి బిఆర్ఎస్ పార్టీ బరిలో ఉంటానని ఆశీర్వదిస్తే అభివృద్ధికై ప్రజల కష్టాలు తీరుస్తానని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఒకే పార్టీ ఒకే జెండా ప్రస్తుతం అందోల్ జోగిపేట్ మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ బరిలో ఉన్నానని ఆయన అన్నారు .మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆశీస్సులు తనకే ఉన్నాయంటూ 18వ వార్డ్ కౌన్సిలర్ బరిలో నేను ఉంటానని రఫీక్ ఆవేదన వ్యక్తం చేశారు.ం

## మున్సిపాలిటీ ఓటర్ జాబితా పరిశీలించిన కలెక్టర్

**ఆదివారం జిల్లా కేంద్రంలో గల మున్సిపాలిటీని సందర్శించి ఓటర్ జాబితాను కలెక్టర్ పరిశీలించారు.**





**మెదక్ జిల్లా ప్రతినిధి జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ ఏ సమయంలోనైనా విడుదల కావచ్చుని దానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ జాబితా తయారీలో ఎన్నికల నిబంధనలను పాటించినట్లు వివరించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు తావు లేకుండా విధులు నిర్వహించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, మేనేజర్ భవాని, ప్రభాకర్ సంబంధిత మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### అభినవ శబరిమలై దీక్ష ముగించుకొని

## రాయికల్ చేరుకున్న 60 మంది దీక్ష పరులు



**రాయికల్ పట్టణం జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణం చెన్నామనేని నివేదిత కీర్తిశేషులు కృష్ణారావు అయ్యప్ప దేవాలయం నుండి 60 మంది స్వాములు 41 రోజు దీక్ష పట్టి ఇరుముడి కట్టుకొని అభినవ శబరిమలై దర్శనం చేసుకుని దీక్ష సంపూర్ణం చేసుకొని రాయికల్ చేరుకోవడం జరిగింది.మా గురుస్వాములు మునుగోటి సత్యనారాయణ గురుస్వామి మునుగోటి సాయి సుధీర్ శర్మ ఆశీస్సులతో అయ్యప్ప దర్శనాన్ని సంపూర్ణం చేసుకున్నాం అలాగే మా వెంబటే ఉండి మమ్మల్ని మా యొక్క స్వాములందరిని ముందుకు నడిపించిన కైరం సత్యం మరియు ఇల్లెందుల శ్రీను రాచకొండ వెంకటేష్ మా శబరిమలై యాత్రను సంపూర్ణం చేసినందుకు పాదాభివందనములు

## ఇటిక్యాలలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ధనుర్మాసము సందర్భంగా కుడారై మహోత్సవం

**రాయికల్ పట్టణం జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలంలో ఇటిక్యాల గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ఈరోజు కుడారై మహోత్సవం పండితులు రామకృష్ణ మాచార్యులు, వెంకటరమణాచార్యులు వెంకటకృష్ణచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కనుల పండుగగా నిర్వహించారు.. కొత్త పాత్రలలో పాయసమును ఉంచి స్వామివారికి నైవేద్యమును సమర్పించారు.. అనంతరం భక్తులందరికీ పాయసం పాత్రలు అందజేశారు.. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి భక్తుల హాజరైనారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లారెడ్డి, రఘునాథ ఆచార్యులు, సురకంటి నాగిరెడ్డి, కనపర్తి శ్రీనివాస్, ఉట్నూరి గంగాధర్, నాయకులు సాయ గౌడ్, గంగారెడ్డి, సామల వేణు, కొల్లూరు వేణు, అనుపురం లింబాద్రిగౌడ్, నారాయణరెడ్డి, రాజారెడ్డి, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట లో 14వ వార్డ్ లో ముగ్గుల పోటిలు.

### -బిఆర్ఎస్ నాయకుడు పల్లె నాగవ్యతి వెంకట రమణ.





**ఆందోల్ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్):** అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో పరిధిలోని జోగిపేట లో 14వ వార్డు లోని లో మహిళలకు ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పండుగ విశిష్టత పర్యావరణ పరిరక్షణపై చుక్కల ముగ్గులకు వివిధ రంగులఅద్ది సందేశాత్మకంగా, కళాత్మకంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అనేలా ఇండ్ల ముందు ముగ్గులతో కాలనీ కలకాడలాడింది. మొదటి బహుమతి, చిట్యాల మానస, అరుణ, డి, అర్చనా,రెండవ బహుమతి సరిత, జె అన్నమ్మ, జె లక్ష్మీ, కొండగొని స్వాతి ,మూడవ బహుమతి స్రవంతి, సౌందర్య, స్వాతి లకు గెలుపొందిన వారికి పల్లె నాగవ్యతి వెంకట రమణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ భవాని నాగరత్నం గౌడ్, చాపల వెంకటేశం, బిఆర్ఎస్ సీనియర్ యువ నాయకులు విజయ్ కుమార్,రొయ్యల సత్యం, రొయ్యల శేఖర్, దుర్గేష్, రాజు, కరుణాకర్ , సాయి,తదితరులు పాల్గొన్నారు.

## మాలలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, మరియు ఇతర అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి: అల్లూరి.భూమన్న.



**ఆదిలాబాద్ 11 జనవరి( ప్రజా రిపబ్లిక్ న్యూస్):** మాల సంక్షేమ సంఘం భవనం న్యూ హౌసింగ్ బోర్డ్ లోని ఇటీవల నూతనంగా ఎన్నికైన తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామ సర్పంచిగా ఎన్నికైన ఉడుగు.రాకేష్ ను సంఘశీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు అల్లూరి.భూమన్న మాట్లాడుతూ మాలలు రాజకీయంగా, ఎదగాల్సినటువంటి అవసరం ఉందని భవిష్యత్తులో అదిలాబాద్ జిల్లాలో మరియు తెలంగాణ రాష్ట్రంలోనే మాలలు రాజకీయంగా,సామాజికంగా, ఆర్థికంగా, ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ ఉన్నత స్థానంలోకి ఎదగడానికి ఇలాంటి రాజకీయ వేదికలని పదవుల్ని నిస్వార్థంగా నిజాయితీగా సమాజానికి సేవ చేసి ఆదర్శంగా నిలబడాలని, డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం స్ఫూర్తితో మన హక్కుల కోసం పోరాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా, సమ సమాజ నిర్మాణానికి యువత ముందుండి నడవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ.ఎస్టీ అట్రాసిటీ మెంబర్ శశికాంత్, నాయకులు మాల సంఘం మహిళ అధ్యక్షురాలు స్వరూప రాణి, హర్ష,రమేష్, ప్రభుదాస్,నిమ్మల.ప్రశాంత్, గు కుంట.క్రాంతి కుమార్,వేల్పుల. భూమన్న, నల్ల.దేవదాస్, గజానం,శ్రీనివాస్,గడుగు. పొచ్చన్న.మాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నేతుల. గంగన్న, దేవన్న,ఆశన్న, రాహుల్, మరియు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

## ముగ్గుల పోటీలు



**మల్లాపూర్ జనవరి 11 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈరోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ముగ్గుల పోటీలను నిర్వహించినారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి చింత కవిత, ద్వితీయ బహుమతి కస్తూరి లాస్య వీరు ఇరువురు విజేతలుగా నిర్ణయించబడ్డారు. వీరికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమ అశ్విన్ కుమార్ ప్రథమ ద్వితీయ బహుమతులను అందజేసినారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నూనె శ్రీనివాస్, కార్యదర్శి చింత శశిధర్, మండల ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కస్తూరి స్వప్న, కార్యదర్శి గాదే లిఖిత, కోశాధికారి పడగల ఆమని, శివరామ కిషన్ గుప్తా, కంటాల రాజన్న, ర్యాగల్ల వెంకటేశ్వర్లు, నూనె అంజనేయులు, కస్తూరి సంతోష్, కస్తూరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బరిలో మ్యాతరి శ్రీనివాస్

**అందోల్ జనవరి 11 ( రిపబ్లిక్ న్యూస్)**



అందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో 6వ వార్డ్ నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బరిలో మ్యాతరి శ్రీనివాస్ ఉంటానని మాట్లాడుతూ మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులు నాకు ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు 6 వార్డు లో ఉన్న ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వార్డులో ఏ సమస్య తలెత్తకుండా వార్డు అభివృద్ధి కి కృషి చేస్తానని ఆయన అన్నారు

## వడ్డేలింగాపుర్ వడ్డెర కాలనీలో వడ్డె ఓబన్న 219వ జయంతి ఉత్సవాలు

**రాయికల్ పట్టణం జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ లో వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.రేనాటి ప్రాంతంలో పోరాడిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న గారి 219 వ జయంతి
బ్రిటిష్ వారిని గడగడలాడిశీచిన రేనాటి వీరుడు .రేనాటి ప్రాంతంలో పోరాడిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడు.సుమారు 39 ఏళ్ల వయసులో 1846-47 మధ్య జరిగిన పోరాటంలో వీరోచితంగా



పోరాడుతూ అమరులయ్యారు వడ్డెర ఐకాన్ వడ్డే ఓబన్న గారి 219 వ జయంతి శుభాకాంక్షలుఈ కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర యువజన సంఘం జగిత్యాల జిల్లా కోశాధికారి పల్లపు రాజేష్ ,మండల యూత్ ఉపాధ్యక్షులు పల్లపు రజినీకాంత్,గ్రామ పెద్దమనుషులు అలకుంట మల్లేశం ,సుర సాయిలు , రాజనర్సయ్య,పాపయ్య, రాజారెడ్డి, నర్సయ్య బొంతాల రాజం,కొమురయ్య,కిట్టిరెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి, దేవరాజం, మల్లేశం, చిన్న నర్సయ్య ఏ్రయ.. మరియు 1వ వార్డ్ మెంబర్ దండుగుల నర్సయ్య, 2వ వార్డ్ మెంబర్ పల్లపు లక్ష్మి - గంగనర్సయ్య . ఉపసర్పంచ్ భూక్యా శంకర్ యూత్ సభ్యులు వంశీ,రాము, సతీష్, మధు,కళ్యాణ్, ప్రశాంత్, ప్రమోద్, అనిల్ ప్రవీణ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ""అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్""

### -డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**రాయికల్ పట్టణం జనవరి11( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ అని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, తాజా మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు
జిల్లా కేంద్రంలోని శివ సాయి లడ్జిలో కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల ఆధ్వర్యంలో అలిశెట్టి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభాకర్ సాహిత్యం సమాజహితాన్ని కోరిందని, సమాజ రుగ్మతలు రూపుమాపడానికి అతని అక్షరాలు దోహదం చేసిందని పేర్కొన్నారు. అనంతరం రచయితలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దాసరి ప్రవీణ్, అల్లే సాగర్, టీవీ సూర్యం, గుండేటి రాజు, ఉపాధ్యాయులు, రచయితలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు....



## రాయికాల్ ఆర్.ఎం.పి పి.ఎం.పి క్యాలండర్ ఆవిష్కరణ...

### -ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జనవరి 11( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల
ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన రాయికల్ మండల ఆర్ఎంపి పి.ఎం.పి అధ్యక్షులు చెలిమేల మల్లేశం అనంతరం ఆర్ఎంపీ పీఎంపీ నూతన సంవత్సర క్యాలండర్ ను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతుల మీదగా విడుదల చేశారు
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చెలిమేల మల్లేశం.ప్రధాన కార్యదర్శి రొట్టె శ్రీధర్.కోశాధికారి మహ్మద్ సమీర్. ఉపాధ్యక్షులు వేముల



రాము.సంయుక్త కార్యదర్శి ధనకంటి ప్రవీణ్.గౌరవ సలహాదారులు పిపోజి మహేందర్ బాబు.మోర వెంకటేశ్వర్లు.జిల్లా ఉపాధ్యక్షులు సల్లూరి తిరుపతి.కార్యవర్గ సభ్యులు పారిపెల్లి మహేష్. బోగ



రాము. బైరి సుకేష్.మోర శంకర్. రోండ్ల రాజేశం. కాయితి సంజీవ్.నామ్ శ్రీనివాస్.అజయ్.జంగిలి నరేష్. తదితరులు పాల్గొన్నారు